

సూపర్ ఫాలోయింగ్

- జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు విశేష ఆదరణ
- ఇన్‌స్టాలో 1.45 లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.13 లక్షల ఫాలోవర్స్
- యూట్యూబ్‌లో 1.62 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- రీల్స్‌తో లక్షల్లో లైకులు కొల్లగొడుతున్న చిట్టిబాబు

- 8లో





అక్కయ్యపాలెం రామలింగేశ్వరాలయంలో సోమవారం రాత్రి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హరహర మహాదేవ

- కిటకిటలాడిన శివాలయాలు
- ఘనంగా కార్తీక మాస తొలి సోమవారం పూజలు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలన్నీ కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు జరిగాయి. పరమేశ్వరుని దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. శివునికి పూజలు చేసి ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నక్కవానిపాలెం ఆలయంలో అభిషేకం

డీఎస్సీకి రంగం సిద్ధం

రేపే నోటిఫికేషన్ విడుదల?

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 734
- స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో 518...
- సెకండరీ గ్రేడ్ 216
- ఎస్జీటీలో తెలుగు 205, ఉర్దూ 11 ఖాళీలు



విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహణకు 'కూటమి' రంగం సిద్ధం చేస్తోంది. ఈనెల ఆరో తేదీన నోటిఫికేషన్ విడుదల కానున్నది. దీనికి అనుగుణంగా సోమవారం టెట్ ఫలితాలు విడుదల చేశారు.

ఖాళీల వివరాలు

సబ్జెక్టు	కేటగిరీ	జడ్పీ/ప్రభుత్వ	మునిసిపల్	మొత్తం
గణితం	ఎస్ఏ	57	2	59
పీఎస్	డిటో	36	3	39
బీఎస్	డిటో	52	10	62
సోషల్	డిటో	88	06	94
తెలుగు	డిటో	24	10	34
హిందీ	డిటో	28	04	32
ఇంగ్లీష్	డిటో	52	07	59
పీడీ	డిటో	139	00	139
ఎస్జీటీ (తెలుగు)		139	66	205
ఎస్జీటీ (ఉర్దూ)		10	01	11
మొత్తం		625	109	734

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 734 ఖాళీలు ఉన్నట్టు విద్యా శాఖ గుర్తించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపింది. అటుఇటుగా సుమారు 1,000 ఖాళీలు ఉంటాయని అధికారులు నాలుగు నెలల క్రితం చెప్పారు. తీరా ఇప్పుడు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో మాత్రం 734 ఖాళీలు ఉన్నట్టు పొందుపరిచారు. వీటిలో జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో 625, మునిసిపల్ పాఠశాలల్లో 109 ఖాళీలు ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ-తెలుగు) ఖాళీలు 205, ఉర్దూ 11 ఖాళీలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో గణితం 59, ఫిజికల్ సైన్స్ 39, బయాలజీ 62, సోషల్ స్టడీస్ 94, తెలుగు 34, హిందీ 32, ఇంగ్లీష్ 59, ఫిజికల్ డైరెక్టర్ 139...మొత్తం 518 పోస్టులు ఉన్నాయి. అయితే ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయ ఖాళీలను తాజా నోటిఫికేషన్‌లో పొందుపరచలేదు. 2018లో చివరిసారిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి ఖాళీలు భర్తీచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి ... మిగతా 6వ పేజీలో

రోడ్ ఫ్లైఓవర్ కమ్ మెట్రో కారిడార్

రెండు లేయర్ల (డబుల్ డెక్కర్) నిర్మాణం

- మూడు నెలల్లో మెట్రో రైలు ప్రాజెక్టు అధ్యయన నివేదిక సిద్ధం
- 8 ఫ్లైఓవర్లను కలుపుతూ 14 కి.మీ. కారిడార్
- మరో 2 ఫ్లైఓవర్లతో 4 కి.మీ. కారిడార్
- నిధులు సమకూర్చాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వినతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యేలోగా నగరంలో జాతీయ రహదారిపై ప్రతిపాదిత ఫ్లైఓవర్లను నిర్మించాలన్న విశాఖ ప్రజల డిమాండ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిగణనలోకి తీసుకున్నారు. కొమ్మాది నుంచి గాజువాక వరకు నిర్మించే మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో వీటిని కూడా అంతర్భాగం చేసి పనులు చేపట్టాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. దాంతో అటు మెట్రో రైలు, ఇటు ఫ్లైఓవర్ల నిర్మాణం రెండూ ఒకేసారి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు, జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ల నిర్మాణంపై రెండు రోజుల క్రితం పురపాలక శాఖా మంత్రి నారాయణ సమక్షంలో వీఎంఆర్‌డీఏలో జరిగిన సమావేశంలో ఒక స్పష్టత వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత జూలైలో చేసిన సూచన మేరకు పనులు ఎలా చేపట్టాలనే దానిపై అధికారులు అంతా చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. విశాఖపట్నం మీదుగా వెళ్లే జాతీయ రహదారి-16పై ఫ్లైఓవర్ల అవసరం చాలా ఎక్కువగా ఉందని జిల్లా



ఫ్లైఓవర్ కమ్ మెట్రో కారిడార్ నమూనా చిత్రం

ప్రజా ప్రతినిధులు నొక్కి చెప్పడంతో సీఎం అందుకు అనుగుణంగా మెట్రో కారిడార్ డిజైన్ మార్చాలని సూచించారు. ఇటు మెట్రో కారిడార్, అటు ఫ్లైఓవర్ల రెండూ ఒకే అలైన్‌మెంట్‌లో ఉండాలని స్పష్టంచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రెండు లేయర్ల విధానం (డబుల్ డెక్కర్)లో కారిడార్ ఉండాలన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో...

సీఎం చంద్రబాబునాయుడు గత జూలై నెలలో చేసిన సూచనల మేరకు అమరావతి మెట్రో రైలు కారిడార్ ప్రాజెక్ట్ ఎండీ ఈ బాధ్యతను తీసుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జాతీయ రహదారుల సంస్థ ప్రాంతీయ అధికారి, ఎల్ అండ్ టి, రైట్స్ తదితర ప్రైవేటు ఏజెన్సీలతో చర్చించి 'రోడ్ ఫ్లైఓవర్-కమ్-మెట్రో కారిడార్' నిర్మాణానికి సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదిక మూడు నెలల్లో ... మిగతా 6వ పేజీలో

ఇకపై డ్రోన్లు

- అనధికార నిర్మాణాలు/లేఅవుట్లకు చెక్ పెట్టేందుకు వినియోగం
- జీవీఎంసీ, వీఎంఆర్డీఏ నిర్ణయం
- ఆదాయం పెంపునకు కూడా...
- ఖాళీ స్థలాల గుర్తింపునకు సర్వే
- ఆస్తి పన్ను, వీఎల్‌టీ ద్వారా ఏడాదికి రూ.75 కోట్ల ఆదాయం పెంపు దిశగా కసరత్తు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరిపాలనను సులభతరం చేయడం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో జిల్లా అధికారులు కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ సంస్థలు డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాయి. ఆదాయం పెంచుకోవడానికి వీటిని విరివిగా ఉపయోగించాలని నిర్ణయించాయి.



జీవీఎంసీ, వీఎంఆర్డీఏలు భవనాల నిర్మాణం, లేఅవుట్ల ఏర్పాటుకు అనుమతులు ఇస్తుంటాయి. అయితే చాలామంది నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. అనధికార లేఅవుట్లు వేస్తున్నారు. అలాగే అనధికారికంగా అదనపు అంతస్థులు నిర్మిస్తున్నారు. వీటిని స్థానిక జోనల్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీనివల్ల ఈ రెండు సంస్థలకు ఆదాయం తగ్గిపోతోంది. ఇకపై అనధికార లేఅవుట్లు, నిర్మాణాలను గుర్తించడానికి డ్రోన్లను వినియోగించాలని రెండు సంస్థల అధికారులు నిర్ణయించారు. దీనికి పురపాలక శాఖా మంత్రి ఆమోదం కూడా లభించింది. జీవీఎంసీ ఈ దిశగా మరో అడుగు ముందుకువేసి క్లోవ్ టెక్నాలజీస్ అనే సంస్థతో కలిసి పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. తొలుత జోన్-11లో డ్రోన్లతో అనధికార నిర్మాణాలను గుర్తిస్తారు. అలాగే ప్రతి జోన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌ను ఏర్పాటుచేస్తున్నారు. వీరికి ఒక వాహనం కేటాయించారు. వీరు డ్రోన్లు గుర్తించిన అనధికార నిర్మాణాల వద్దకు వెళ్లి వాటిని తొలగిస్తారు. ప్రధాన కార్యాలయానికి నివేదిక సమర్పించిన తరువాత, నిజంగా వాటిని తొలగించారా?, లేదా?...అనేది మరోసారి పరిశీలిస్తారు. దీనివల్ల అనధికార నిర్మాణాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

ఆదాయం పెంచుకునేలా

వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ... మిగతా 6వ పేజీలో

గతుకుల రోడ్లకు మోక్షం

మరమ్మతులకు నిధులు విడుదల



విజయనగరం-శొంఠ్యాం రోడ్డులో పద్మనాభం మండలం చిన్నాపురం జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి (ఫైల్ ఫొటో)

- రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 70 కిలోమీటర్ల మేర రహదారులపై గుంతలు
- వాటిని పూడ్చేందుకు రూ.1.38 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఇప్పటికే రూ.90 లక్షలు విడుదల, టెండర్ల ప్రక్రియ పూర్తి
- తొలి దశ పనులు డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారుల మరమ్మతుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.800 కోట్లు మంజూరుచేయగా, అందులో విశాఖ జిల్లాకు రూ.1.38 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జిల్లాలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చనున్నారు.

విశాఖ జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 253 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయి. వీటిలో 70 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు ఉన్నట్టు ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. రెండు దశల్లో ఈ గుంతలను పూడ్చాలని ఆదేశాలు వచ్చాయి. తొలిదశలో 25 కిలోమీటర్ల మేర రోడ్లపై ఉన్న గుంతలు ... మిగతా 6వ పేజీలో

గుంతల పూడ్చివేతకు వంద రోజులు ప్రణాళిక

- జీవీఎంసీ పరిధిలోని రోడ్లపై 4,441 గుంతలు గుర్తింపు
- తొలిదశలో రూ.6.83 కోట్లతో 2009 గుంతలు పూడ్చివేత పనులు ప్రారంభం

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలో గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా జీవీఎంసీ వంద రోజులు ప్రణాళికను అమలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన పనులకు కమిషనర్ పి.సంపత్‌కుమార్ శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ పరిధిలోని జాతీయ రహదారితో పాటు ఇతర ప్రధాన మార్గాల్లో 4,441 గుంతలు ఉన్నట్టు ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. తొలిదశలో 2009 గుంతలు పూడ్చివేత పనులు రూ.6.83 కోట్లతో ప్రారంభించారు. మిగిలిన గుంతలు పూడ్చివేతకు మరోసారి టెండర్లు పిలవనున్నారు. రెండు నెలల్లో నగర పరిధిలోని రోడ్లపై ఏర్పడిన గుంతలన్నింటినీ పూడ్చివేయనున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. గత ... మిగతా 6వ పేజీలో

సైబర్ నేరాల కోసం వందల్లో బ్యాంకు అకౌంట్లు



- రూ.కోట్లలో లావాదేవీలు... గుర్తించిన పోలీసులు
- ఇప్పటివరకూ 16 మంది అరెస్టు

ఎండాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఇల్లీగల్ పేమెంట్ గేట్ వే కేసు దర్యాప్తులో సైబర్ క్రైమ్ పోలీసులు పురోగతి సాధించారు. నిందితులైన సాయిరామ్, సూర్యమోహన్, గిరీష్‌తో పాటు మరో ఇద్దరు సైబర్ నేరాల కోసం ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో విడ్డూరం

- జీతాలు సకాలంలో ఇవ్వాలని ఆందోళన చేసినందుకు ఉద్యోగులకు తాఖీదులు
- మరోసారి ధర్నాలు చేస్తే చర్యలు చేపడతామని హెచ్చరికలు
- యాజమాన్యం వైఖరిపై కార్మిక సంఘాల మండిపాటు



విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు ఉద్యోగులకు యాజమాన్యం వ్యక్తిగత తాఖీదులు జారీ చేస్తోంది. గత ఆరు నెలలుగా ఉద్యోగులకు జీతాలు సరిగ్గా ఇవ్వడం లేదు. దసరాకు బోనస్ లేదు. యాజమాన్య వైఖరిపై ఉద్యోగులు మీడియాకు సమాచారం ఇస్తే, అలా చేయకూడదని, పత్రికా ప్రకటనలు ఇవ్వకూడదని ఆంక్షలు విధించారు. గత నెలలో ఉద్యోగుల ఇంటి అద్దె అలవెన్స్ తీసేశారు. అలాగే క్వార్టర్స్‌లో ఉంటున్న వారి జీతాల్లో విద్యుత్ బకాయిల పేరుతో రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ కోత విధించారు. దీనిని నిరసిస్తూ ఉద్యోగులు అక్టోబరు 5, 6 తేదీల్లో వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట పగలు, రాత్రి లేకుండా ధర్నా చేశారు. తమకు జీతాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానిపై అప్పుడు మిన్నకున్న యాజమాన్యం తీరుబడిగా ఆ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు తెప్పించుకొని అందులో పాల్గొన్న ఉద్యోగులకు సంబంధిత విభాగ అధిపతుల ద్వారా హెచ్చరిక నోటీసులు జారీచేస్తోంది. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రాంగణంలో ... మిగతా 6వ పేజీలో

నాగుల చవితికి ఏర్పాట్లు

ఆరిలోవ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగులు చవితి పర్వదినం సందర్భంగా మంగళవారం నాగదేవతకు మొక్కులు తీర్చుకునేందుకు ఆరిలోవ శివారు ప్రాంతాల్లో పుట్టలను సిద్ధం చేశారు. ఇక్కడ ప్రకృతి సిద్ధంగా అనేక పుట్టలు ఉన్నాయి. వాటి చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. జూ సిబ్బంది కంబాల కొండలోను, ముడసర్లోవ పార్కులో అనేక పుట్టల వద్ద శుభ్రపరిచారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు అనేక మంది తరలివస్తారు.

క్రీడాకారిణికి అభినందనలు

ఆరిలోవ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తోటగరువు ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని క్రీడాకారిణి, విద్యార్థిని గంటా మౌనికను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆకాంక్షించారు. తోటగరువు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మౌనిక అండర్- 15 క్రికెట్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి ట్రోఫీ సంపాదించింది. ఆమె ఈనెల 21న కటక్‌లో జరగనున్న పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొనుంది. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా భవాని, పీడీలు శ్రీనివాసరావు, చంద్రబాబునాయడు, కోచ్‌లు కె. బొర్రయ్య, కోరాడ శంకరరావు, ఉపాధ్యాయిని అనూరాధ పాల్గొన్నారు.

డీఎస్సీకి రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన తరువాత ఒక్కసారి కూడా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. ఈఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. వైసీపీ ఓటమి పాలై కూటమి అధికారంలోకి రావడంతో ఇచ్చిన మాట ప్రకారం పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ప్రకటన కోసం సుమారు 60 వేల మంది ఎదురుచూస్తున్నారు.

ఉక్కులో విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని, ధర్నాలో పాల్గొన్నారని, ఇతర ఉద్యోగులను ప్రేరేపించారని ఆరోపిస్తూ ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. దీనిని మొదటి తప్పుగా పరిగణించి చర్యలు తీసుకోవడం లేదని, ఇంకోసారి ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సుమారు 400 మంది ఉద్యోగులకు ఇప్పటి వరకూ నోటీసులు జారీచేసింది.

తీవ్ర వ్యతిరేకత

యాజమాన్యం వైఖరిపై ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. యాజమాన్యం తప్పుడు విధానాలు అవలంబిస్తూ హక్కుల కోసం ఉద్యోగులు పోరాటం చేస్తే చర్యలు చేపడతామని బెదిరించడాన్ని అంతా ఖండిస్తున్నారు. నిబంధనలు పాటిస్తూ తమకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చేస్తే తమకు ధర్నాలు చేయాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బెదిరింపు ధోరణి వీడాలని డిమాండ్ చేస్తున్నారు.

సినిమా గైడ్

● **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్ :** మెలోడి, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 38, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 32, పచ్చిమిర్చి 52 కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజి 36, క్యారెట్ 62 దొండకాయలు 38, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)60, బరబటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోసకాయ 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

శివాలయాల్లో కార్తీక పూజలు



మద్దిలపాలెంలోని రామలింగేశ్వర ఆలయంలో పూజలు



కొత్త వెంకోజీపాలెంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



ఆరిలోవలోని జ్యోతిర్లింగేశ్వరాలయంలో పూజలు

» తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు
» కిటకిటలాడిన గౌరీజ్ఞానలింగేశ్వరాలయం

వెంకోజీపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ ఆలయాలు ప్రతిధ్వనించాయి. శివుని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము 3 నుంచే కొత్తవెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అరవెల్లి సూర్య ప్రకాశ్ శర్మ ఆధ్వర్యంలో ఎ. రామకృష్ణ శర్మ, పి. సుబ్రహ్మణేశ్వర శాస్త్రి, పి. బాల భాస్కరశర్మ, ప్రభాకరశర్మ, సాయిశర్మ తదితరులు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆకాశ జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. హెచ్‌బీకాలనీలో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అభిషేకాలు జరిపించారు. మహిళలు ఆలయంలోని ధ్వజస్తంభం, రావిచెట్టు, తులసి కోట వద్ద దీపారాధనలు చేశారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఆకాశజ్యోతులు వెలిగించారు. ఆలయ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇసుకతోటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేఆర్‌ఎం కాలనీలోని శివాలయానికి భక్తులు పోటెత్తారు.మహిళలు దీపాలు వెలిగించారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : ఓంకార నాదంతో శివాలయాలు మారుమోగాయి. ఆరిలోవ ఆఖరి బస్సు స్టాపు సమీపంలోని జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయం సోమవారు భక్తులతో కిటకిటలాడింది. స్వామికి వివిధ జీవనదులు, గంగాజలం, పంచామృతాలు, పాలు, నారికేళ జలాలు, విభూతి, తేనె, సుగంధద్రవ్యాలతో పూజలు చేశారు. వేకువ జాము నుంచి భక్తులంతా క్యూకట్టి స్వామిని దర్శించుకున్నారు 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు.. ఈ ఆలయంలో ప్రతి ఒక్కరూ శివలింగాలకు నేరుగా పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పెద గదిలిలోని కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి, ఆరిలోవ మల్లేశ్వర స్వామి, ఆరిలోవలోని వీరబ్రహ్మేంద్ర స్వామి, చినగదిలి నార్త్ షిర్డి సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని స్ఫటిక లింగేశ్వర స్వామి,, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్ని చోట్ల భక్తులు విశేష సంఖ్యలో హాజరై శివ దర్శనం చేసుకున్నారు.



కొత్త వెంకోజీపాలెం ఆలయంలో పూజలు

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : మద్దిలపాలెం, శివాజీపాలెం ప్రాంతాల్లో శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. కార్తీకమాస తొలి సోమవారం కావడంతో ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైతన్యనగర్ శివాలయం, శివాజీపాలెం శ్రీరామలింగేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తిపరవశులయ్యారు. పార్వతి సమేత పరమేశ్వరుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక పూజలకు ఆలయ కమిటీలు భక్తులకు వసతులు కల్పించాయి.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



పెదవాల్తేరు రైతుబజార్ రోడ్డులో దుకాణాలు



శివాజీ పార్కు రోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణాలు

» త్రీటౌన్ పోలీసు స్టేషన్, శివాజీ పార్కు రోడ్డులో ఇష్టానుసారం దుకాణాల ఏర్పాటు
» పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

పెదవాల్తేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్లకి ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన వీటిని కొందరు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. శివాజీ పార్కు రోడ్డులో, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ దారి పెదవాల్తేరు రైతుబజారు రోడ్డులో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. జీవీఎంసీ అధికారులు ఇక్కడ గతంలో ఉన్న ఆక్రమణలను తొలగించి, రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. కానీ ఫుట్‌పాత్‌లపై మళ్లీ దుకాణాలు వెలిశాయి. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడలి నుంచి ఇసుకతోట జాతీయ రహదారి వరకు శివాజీ పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌లకు ఇరువైపులా విచ్చలవిడిగా ఆక్రమణలు పెరిగిపోవడంతో పాటు రోజుకో దుకాణం వెలుస్తోంది. కొంతమంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, షాపులు పెట్టి వాటిని అద్దెకు ఇస్తున్నారు. మరికొందరు ఇటుకలు, ఇసుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా. ఎవరూ పట్టించుకోవడం లేదు.

'ఇ-కంటెంట్'పై పరిశోధకులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పరిశోధకులకు, విద్యార్థులకు ఇ-కంటెంట్‌పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు ఎబెస్కో ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏపీ, తెలంగాణ, శ్రీలంక, మాల్దీవులలో బిజినెస్ మేనేజర్ ఎస్.కళాధర్ రెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై పరిశోధకులకు అవగాహన కల్పించారు. ఈకంటెంట్ అంటే ఈ జర్నల్స్, ఈ బుక్స్ డేటాబేస్ అని, పరిశోధన పత్రాలు, పరిశోధక గ్రంథాలను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిశోధక ఆవిష్కరణలు ఎప్పటికప్పుడు ఈ జెనరల్స్‌లో ప్రచురించి యువ పరిశోధకులకు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. ఇది మెరుగైన పరిశోధక పత్రాలను, పరిశోధనలు చేయటానికి ఉపయోగపడుతుందన్నారు. ఒకప్పుడు ప్రతి పరిశోధకుడు తన సమయాన్ని గ్రంథాలయాల్లో గడిపేవారని, ప్రస్తుతం డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రావడంతో బుక్స్, జర్నల్స్, మ్యాగజైన్స్ అన్నీ డిజిటలైజేషన్ అయ్యి ఈ కంటెంట్ రూపంలో ప్రతి పరిశోధక విద్యార్థికి అందుబాటులోకి తీసుకువస్తున్నారని, వీటిని ఉపయోగించి నాణ్యమైన పరిశోధనలు చేయవచ్చన్నారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ పరిశోధకులకు, విద్యార్థులకు అకాడమిక్, రీసెర్చ్ అభివృద్ధి కోసం విభాగం ఏ కార్యక్రమాన్నైనా చేయటానికి సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని త్వరలోనే పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై వారం రోజుల వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.



వీసీకి వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏయూ వీసీని కలిసిన ఏబీవీపీ నాయకులు

వెంకోజీపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వీసీ శశిభూషణరావుతో ఆయన కార్యాలయంలో ఏబీ వీపీ నాయకులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, వర్సిటీకి సంబంధించిన పలు అంశాలను వారు వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఏబీవీపీ రాష్ట్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన విశ్వవిద్యాలయాల సదస్సులో చర్చించిన పలు అంశాలను తెలియజేశారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే అంశా లపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ జి.కిరణ్, రాష్ట్ర సం యుక్త కార్యదర్శి జి. సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రచించిన ఆమె స్వీయ చరిత్ర పుస్తకాన్ని రైటర్స్ అకాడమీ ప్రతినిధులు వీసీ శశిభూషణరావుకు అందజేశారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు కళా క్షేత్రంలో రైటర్స్ అకాడమీ నిర్వాహకుడు రమణమూర్తి చేతుల మీదుగా ఈ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని ఏయూ తెలుగు విభాగానికి, ఏయూ గ్రంథాలయానికి ఉపయోగంగా ఉంచాలని రైటర్స్ అకాడమీ ప్రతినిధి మేడా మస్తాన్ రెడ్డి, అమర్ రాజా సంస్థల ప్రతినిధి ఎల్. మహదేవనాయుడు వీసీని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇకపై డ్రోన్లు

... 5వ పేజీ తరువాయి

రెండింటికీ ఖాళీ స్థలాలపై పన్ను విధించే అధికారం ఉంది. జీవీఎంసీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 37,752 ఖాళీ స్థలాలను గుర్తించి రూ.3.85 కోట్లకు పన్ను నోటీసులు ఇచ్చారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ 39,004 ఖాళీ స్థలాలను గుర్తించి రూ.4 కోట్ల పన్ను వసూలు కోసం నోటీసులు జారీచేశారు. అయితే ఇంకా చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని, స్థానిక సిబ్బంది లాలూచీపడి వాటికి పన్ను విధించడం లేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇకపై మనుషుల ప్రమేయం లేకుండా డ్రోన్ల సాయంతో ఖాళీ స్థలాలను గుర్తించి, ఆ ప్రకారం పన్ను వసూలుకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. వీటి ద్వారా ఏడాదికి 25 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

ఆస్తి పన్ను విధింపులోను...

భవన నిర్మాణ విస్తీర్ణం బట్టి ఆస్తి పన్ను విధిస్తారు. అయితే పలుకుబడిన కలిగిన వారు భారీ భవంతులు నిర్మించుకున్నా చాలా తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. కింది స్థాయి సిబ్బందిని మేనేజ్ చేసి తక్కువ పన్నుతో సరిపెడుతున్నారు. ఇలాంటి వాటిని నిరోధించడానికి కూడా డ్రోన్లను వినియోగించాలని నిర్ణయించారు. అసలు ఆస్తి పన్ను వేయని భవనాలు, తక్కువ పన్ను కడుతున్న భవనాలను గుర్తించి రీఅసెస్‌మెంట్ ద్వారా కొత్త పన్నులు వేయాలని భావిస్తున్నారు. దీని ద్వారా ఏడాదికి అదనంగా రూ.50 కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. తక్షణమే డ్రోన్ల వినియోగం అమలు చేయాలని మంత్రి నారాయణ సూచించడంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.



హిందీ విభాగం ఆచార్యులకు చెక్కు అందిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

హిందీ విభాగానికి యార్లగడ్డ ఆర్థిక సహాయం

వెంకోజీపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ హిందీ విభాగం విద్యార్థులు ఈనెల 27 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు విజ్ఞాన యాత్రకు వెళ్లనున్నారు. వారి ఖర్చుల నిమిత్తం విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రూ.లక్ష అందజేశారు. సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహరావు చేతుల మీదుగా విభాగాధిపతి ఆచార్య ఎస్. సత్యనారాయణకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన యాత్రను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారణాసిలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు, అక్కడ జన్మించిన కవులు, వారి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఆగ్రాలోని హిందీ సంస్థాన్‌ను సందర్శించాలని, అక్కడ అందిస్తున్న సేవలు, హిందీ భాషాభివృద్ధికి జరుగుతున్న కృషిని తెలుసుకోవాలని చెప్పారు.

గుంతల పూడ్చివేతకు వంద రోజులు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా తయారయ్యాయి. గుంతల రోడ్లపై వాహనాలను నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. అయినా వైసీపీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంతల్లేని రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈనెల రెండున రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సైబర్ నేరాల కోసం వందల్లో బ్యాంకు అకౌంట్లు

... 5వ పేజీ తరువాయి

వినియోగించిన 1,258 సేవింగ్, కరెంట్ బ్యాంకు అకౌంట్స్ వివరాలు సేకరించారు. ఇందులో విశాఖలోనే 470 అకౌంట్లు ఉన్నట్టు, వాటి ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. నకిలీ సంస్థ పేరుతో అకౌంట్లను తెరిచి సైబర్ నేరగాళ్లకు అందించిన ఐదుగురినీ అరెస్టు చేశారు. అలాగే నిందితుడు గిరీష్ నిర్వహించిన లక్కీ కిస్మత్ అనే మరొక ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్ కాల్ సెంటర్ గుట్టురట్టు చేశారు. ఈ కాల్‌సెంటర్‌లో 11 మంది యువతులను టెలీ కాలర్స్‌గా చేర్చుకుని వారితో అమాయకులకు ఫోన్లు చేయించి, ఆన్‌లైన్ బెట్టింగ్స్ ప్రోత్సహించేవారు. కాల్ సెంటర్‌లో పనిచేస్తూ నేరానికి సహకరించిన 11 మంది అమ్మాయిలను కూడా గుర్తించి అరెస్టు చేశారు. అలానే ఈ కేసులో చైనా దేశానికి చెందిన ఐదుగురు ఉన్నట్టు గుర్తించారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రూ. 19.91 లక్షలతో విద్యుదీకరణ

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ మూడో సెక్టరు విజయా ఆసుపత్రి కూడలి నుంచి వెంకోజీపాలెం జాతీయ రహదారి కూడలి వరకూ ఆధునిక విద్యుదీకరణ పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న సాధారణ విద్యుత్తు దీపాల స్థానంలో అందమైన స్తంభాలు, దీపాలను ఏర్పాటు చేస్తారు. దీనికి రూ.19.91 లక్షలను జీవీఎంసీ మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని మంగవేణి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం పాల్గొన్నారు.

ఎంవీపీ పోలీసులకు అభినందనలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అదృశ్యం కేసుల్లో చురుగ్గా దర్యాప్తు చేసి, కొలిక్కి తీసుకువచ్చిన ఎంవీపీ పోలీసులను కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. కొద్ది రోజుల క్రితం ఓ మహిళ తన పిల్లలతో పాటు అదృశ్యమైంది. ఈ కేసులో పోలీసులు ఆమె సెల్‌ఫోన్ ఆధారంగా ఎక్కడ ఉన్నదీ తెలుసుకున్నారు. వారిని తీసుకువచ్చి సంబంధీకులకు అప్పగించారు. మరో కేసులో కుటుంబ కలహాల వల్ల ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతన్ని కూడా మొబైల్ లోకేషన్ ఆధారంగా గుర్తించారు. ఈ రెండు కేసులను ఛేదించినందుకు ఎంవీపీ శాంతిభద్రతల సిబ్బందిని సీపీ అభినందించారు.

నైపుణ్య గణన సిబ్బందికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జడ్సీ శివ ప్రసాద్

వెంకోజీపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు జోన్-3 పరిధిలో స్కిల్ సెన్సెస్ సర్వే నిమిత్తం ఎన్యుమరేటర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారి విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తుల వివరాలు సేకరించేందుకు సర్వే జరుగుతోందన్నారు. ఇప్పటికే గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు మండల పరిధిలో సర్వేను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు వెల్లడించారు. ఈనెల రెండో వారంలో ప్రారంభం కాబోతున్న సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అన్ని స్థాయిల్లో నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. 14 నుంచి 27 వార్డుల సచివాలయ కార్యదర్శులకు, స్కిల్ డెవలప్‌మెంట్ ఏరియా కోఆర్డినేటర్లు అయిన సుగుణ, రామకృష్ణ, జోనల్ మాస్టర్ ట్రైనర్ ఆర్.నూతనకుమార్‌రెడ్డి, డి.ఆనంద్ కుమార్ తదితరులు ఈ శిక్షణ పూర్తి చేస్తారని జెడ్సీ శివప్రసాద్ తెలిపారు.

రోడ్ ఫ్లైఓవర్ కమ్ మెట్రో కారిడార్

... 5వ పేజీ తరువాయి

తయారుచేయాలని నిర్ణయించారు. ఇదే విషయం మంత్రి నారాయణ సమీక్షలో వెల్లడించారు.

మొత్తం పది ఫ్లై ఓవర్లు

మెట్రో రైలుతో పాటు వాహనాలు వెళ్లడానికి వీలుగా నిర్మించదలచిన 'రోడ్ ఫ్లైఓవర్-కమ్-మెట్రో కారిడార్'లో మొత్తం పది ఫ్లైఓవర్లు ఉంటాయని వివరించారు. కొమ్మాది నుంచి గాజువాక వరకు మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశ కాబట్టి అటు నుంచి వస్తే మొదట కార్‌షెడ్ జంక్షన్ వద్ద 45 మీటర్లు, ఎండాడ వద్ద 45 మీటర్లు, హనుమంతవాక వద్ద 40 మీటర్లు, మద్దిలపాలెం వద్ద 60 మీటర్లు, సత్యం జంక్షన్ వద్ద 60 మీటర్లు, గురుద్వారా వద్ద 60 మీటర్లు, అక్కయ్యపాలెం వద్ద 45 మీటర్లు, తాటిచెట్లపాలెం వద్ద 60 మీటర్లు, ఎన్ఏడీ జంక్షన్ వద్ద 60 మీటర్లు, గాజువాక వద్ద 60 మీటర్లు, స్టీల్ ప్లాంటు వద్ద 60 మీటర్ల వెడల్పున ఫ్లైఓవర్లు ఏర్పాటుచేస్తారు. ఇవి కాకుండా దువ్వాడలో ఒకటి, లంకెలపాలెంలో మరొక ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ అవి మెట్రో కారిడార్ పరిధిలో లేనందున పక్కనపెట్టారు.

ఒక నిర్మాణంలో 8, మరో నిర్మాణంలో రెండు

సింగిల్ స్ట్రక్చర్ (నిర్మాణం) విధానంలో మెట్రో కారిడార్ ప్రాజెక్టు పనులు చేపడతారు. ఒక నిర్మాణంలో ఎనిమిది ఫ్లైఓవర్లను కలుపుతూ 14 కి.మీ., మరో స్ట్రక్చర్‌లో మిగిలిన రెండు ఫ్లైఓవర్లను కలుపుతూ 4 కి.మీ. పొడవైన మార్గాన్ని నిర్మిస్తామని ప్రాజెక్టు ఎండీ వివరించారు.

కేంద్ర నిధులతోనే...

మెట్రో రైలు ప్రాజెక్టును తొలి దశలో కొమ్మాది నుంచి గాజువాక వరకు 46.23 కి.మీ. పొడవున నిర్మిస్తారు. దీనికి రూ.11,498 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. దీనికి పూర్తిగా కేంద్రమే నిధులు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కోరింది. ఇందులో ఫ్లైఓవర్లు కూడా చేరడంతో వాటికి అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని భావిస్తున్నారు. వీటికి కూడా కేంద్రం సాయం కోరాలని నిర్ణయించారు. ఈ 'రోడ్ ఫ్లైఓవర్లు-కమ్-మెట్రో కారిడార్' ప్రాజెక్టుకు మూడు నెలల్లో అంటే 2025 ఫిబ్రవరి మొదటి వారానికి అధ్యయన నివేదిక సిద్ధం అవుతుంది.

గతుకుల రోడ్లకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

పూడ్చేందుకు రూ.90 లక్షలు విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. డిసెంబరు నెలాఖరు నాటికి ఆ 25 కిలోమీటర్ల మేర రహదారులపై గుంతలు పూడ్చ నున్నారు. రెండో దశలో మరో 45 కిలోమీటర్లు మేర రహదారుల మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం మరో రూ.48 లక్షలు విడుదల య్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. పద్మనాభం, పెందుర్తి మండలాల్లో రహదారులు మరీ అధ్వానంగా ఉన్నాయని, తొలిదశలో వాటి మరమ్మతులు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ రెండు మండలాల్లోనే సుమారు 15 కిలో మీటర్లపైన ఉన్నట్టు వెల్లడించారు.

నిర్లక్ష్యంతో అధ్వానం

గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను పూర్తిగా గాలికి వదిలేసింది. గోతుల్లో కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేదు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్లు వేసేందుకు ఎన్‌డీబీ ఇచ్చిన నిధులు, కేంద్ర ప్రభుత్వం అందించిన సాయాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దాంతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము అధికారంలోకి వస్తే రోడ్లపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం...ఇచ్చిన మాట ప్రకారం మొదట గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసింది.

టీడీఆర్‌ల మంజూరులో జాప్యంపై వినతి

కొమ్మాది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీఆర్‌ల మంజూరులో జాప్యంపై ఆరో వార్డు రేవళ్లపాలెం గ్రామస్తులు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం వారు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడ నుంచి బక్కన్నపాలెం మీదుగా నిర్మిస్తున్న రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇళ్లు తొలగించారని చెప్పారు. ఇళ్లు తొలగించే సమయంలోనే నష్టపరిహారం ఇచ్చారని, కానీ స్థలాలకు సంబంధించి టీడీఆర్ ఇవ్వలేదన్నారు. ఏడాదిగా అధికారులకు విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.

వరిలో కేళీలపై ఆందోళన



అనంతవరంలో ఆర్‌జేఎల్ రకం వరి పంటలో కేళీలు

పద్మనాభం (రూరల్),నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం, పెంట, కొవ్వాడ,గంధవరం గ్రామాల్లో ఆర్‌జేఎల్ రకం వరి పంటలో కేళీలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది జూన్, జూలై నెలల్లో చాలా మంది రైతులు ఆర్బీకేల్లో ఆర్‌జేఎల్ రకం వరి విత్తనాలు తీసుకుని, నాటారు. ఈ బియ్యం తినడానికి బాగుంటాయని, అమ్మకుంటే ఎక్కువ ధర వస్తుందన్న భావంతో దీన్ని సాగు చేశారు. పంట పొట్ట దశకు వచ్చే సమయంలో ఎక్కువగా కేళీలు రావడంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో సంగివలస యువకుడి ప్రతిభ



తగరపువలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు సంగివలసకు చెందిన ఎం. పవన్ సతీశ్ జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపాడు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు కేరళలోని కొచ్చి ఇండోర్ స్టేడియంలో కేరళ కిక్ బాక్సింగ్ చాంపియన్ 2024 పోటీలు జరిగాయి. ఈపోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి పదుల సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో సతీశ్ ఓవ రాల్ చాంపియన్ షిప్‌ను కైవశం చేసుకున్నాడు. సతీశ్ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రేడియోలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు మూడుసార్లు జాతీయస్థాయిలో ప్రతిభ చూపి పలు పతకాలు గెలుపొందాడు. విజేతను స్థానికులు అభినందించారు.

సంప్రదాయబద్ధంగా తిరునక్షత్ర పూజలు



పారాయణలు చేస్తున్న వైదికులు

సింహాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. విశిష్టాద్వైత మతవ్యాపకులు ఆళ్వార్లలోని ఒకరైన మనవాళ మహామునుల తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు, బాల భోగనివేదనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో, ఆళ్వార్లతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. షోడశోపచరాలు సమర్పించిన అనంతరం నాలాయిర దివ్య ప్రబంధంలోని వందలాది పాశురాలను స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు పారాయణలు జరిపారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

సింహాచలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం పర్యవేక్షణలో వార్డు పార్టీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పట్నాల ధర్మరాజు సారథ్యంలో సోమవారం సింహగిరి గిరిజన గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

భీమునిపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవలసిన ఆవశ్యకత వుందని ఎంపీడీఓ హనుమంతరావు అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో భీమిలి రూరల్, అర్బన్ సచివాలయాల సిబ్బందికి నైపుణ్య గణనకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులను మరింత సమర్థంగా నిర్వహించడానికి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ప్రసన్న వాణి, తదితరులు పాల్గొన్నారు.

వంద ఫిర్యాదుల స్వీకరణ

పద్మనాభం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వంద వినతులు వచ్చాయి. వీటిలో గృహ నిర్మాణ శాఖకు చెందిన 80, రెవెన్యూ 8, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 7, ఇతర శాఖలకు చెందిన 5 దరఖాస్తులు ఉన్నాయి. ఎంపీడీఓ విజయకుమార్ వీటినిస్వీకరించారు.

గుంతల్లేని రోడ్లే లక్ష్యం : ఎమ్మెల్యే గంటా



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

పద్మనాభం/పద్మనాభం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జనవరి నాటికి గుంతల్లేని రోడ్లు నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. చిన్నాపురం జంక్షన్ నుంచి శొంఠ్యాం వరకు గతులకులమయంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 860 కోట్లతో రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, నాయకులు లీలావతి, ఎర్నాయుడు, సన్యాసిరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకముందు ఆయన రెడ్డిపల్లిలో రూ. 2.5 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వైసీపీ సర్కారు విద్యా వ్యవస్థను నాశనం చేసింద న్నారు. తమ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను బాలికలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.అనంతరం బాలికలతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో విజయకుమార్, భీమిలి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామానాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ



పీఎంపాలెం యడ్లమల్లేశ్వరస్వామి ఆలయంలో 108 శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు



భీమిలిలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



సింహాచలం : కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు

భీమునిపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ కార్తీక మాసం మొదటి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భీమిలిలోని భ్రమరాంభికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం వద్ద దర్శనాలకు భక్తులు తరలివచ్చారు. నేరేళ్లవలస వద్ద ఉన్న ఎండోమెంట్ స్థలంలోని శివాలయాన్ని కూడా దర్శించుకున్నారు. మెయిన్ రోడ్‌ను ఆనుకుని వున్న ఆలయాల సముదాయంలోని వేణుగోపాలస్వామి,జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయాల ఆవరణలో ఉన్న ఉసిరి, రావి చెట్టుకు,తులసి మొక్కకు, నందీశ్వరులకు దీపారాధనలు చేశారు.

ఎండాడ : జీవీఎంసీ 8, 9 వార్డుల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండాడలోని పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కైలాసగిరి కొండ దిగువన ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు, అభిషేకాలు జరిగాయి. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివాలయంలో పోలీసు అధికారులు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పూజలు చేశారు.

కొమ్మాది : మధురవాడ పరిసరాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొమ్మాదిలోని అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయం ఆవరణలో వైశాఖేశ్వరస్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న యడ్లమల్లేశ్వరస్వామి ఆలయంలో 108 శివ లింగాలకు భక్తులు స్వయంగా అభిషేకం చేశారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు వేకువజాము నుండే భక్తులతో కిటకిటలాడాయి. మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో భక్త లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే మిథిలాపురి వుడా కాలనీలోని ఉమాలింగేశ్వరస్వామి ఆలయం, మధురవాడ కూడలిలోని సిద్దేశ్వరస్వామి ఆలయాల్లోనూ పూజలు జరిపారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు, సింహగిరిపై పలు శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తొలుత సింహగిరి క్షేత్ర పాలకుడు బాలసుందరి సహిత త్రిపురాంతకస్వామి సన్నిధిలో ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు. కొండ దిగువన పాత అడివివరం, సింహపురి కాలనీ, విజినిగిరిపాలెంలోని పలు దేవాలయాల్లో కూడా భక్తులు పరమశివుడ్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయాల ఆవరణలో దీపారాధనలు చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో గీతం విద్యార్థుల ప్రతిభ



తయారు చేసిన వాహనంతో విద్యార్థులు

సాగర్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నోయిడాలోని బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఇటీవల జరిగిన ఇండియన్ కార్టింగ్ రేస్-2024 పోటీల్లో గీతం వర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు సత్తా చూపారు. ఈ పోటీల్లో దేశంలోని 55 వర్సిటీలు పాల్గొనగా గీతం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంజ నీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మక, సాంకేతిక పరిజ్ఞానం, స్వయంగా తయారు చేసే వాహనం సామర్థ్యం వంటి అంశాలను గుర్తించేందుకు గత పదేళ్లుగా జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. గీతం ఆటోమేటివ్ క్లబ్ సభ్యులుగా ఉన్న విద్యార్థులు వాహనం ఇంజన్ నుంచి తయారీలో ఉపయోగించే చిన్న చిన్న బోల్టు వరకు స్వయంగా ఎంపిక చేసుకుని వాహన డిజైనింగ్ ప్రకారం వెల్డింగ్ పనులు సహితం నిర్వహించి నాలుగు నెలల ప్రణాళికతో టీమ్ టైరంట్స్ పేరిట వాహనాన్ని తయారు చేశారు.

నెట్ బాల్ టోర్నీ విజేతలు కణితి, మధురవాడ



బాలుర విభాగంలో మొదటి స్థానం పొందిన మధురవాడ ది గ్లోబ్ స్కూల్ విద్యార్థులు

భీమునిపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి నెట్ బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బాలికల విభాగంలో జడ్పీ హైస్కూల్, కణితి, బాలుర విభాగంలో ది గ్లోబ్ స్కూల్ మధురవాడ విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 17 జిల్లా స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ భీమిలి సన్ స్కూల్‌లో నిర్వహించారు. పోటీలో బాలికల విభాగంలో కణితి జడ్పీహెచ్ఎస్, మధురవాడ ది గ్లోబ్ స్కూల్, నడుపూరు జడ్పీహెచ్ఎస్, మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో మధురవాడ ది గ్లోబ్ స్కూల్, నడుపూరు జడ్పీహెచ్ఎస్, ఉక్కునగరం, సృష్టి వరల్డ్ స్కూల్ విద్యార్థులు మూడు స్థానాలు కైవశం చేసుకున్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్ బాల్ ఇన్‌చార్జి లలిత్‌కుమార్ విజేతలకు బహుమతులు అందించారు. పలువురు క్రీడాకారులకు వ్యక్తి గత పతకాలను అందజేశారు.

జోడుగుళ్లపాలెం నాగక్షేత్రంలో అఘోరీ



యోగీ ప్రభాకర్ స్వామిజీతో అఘోరీ

విశాలాక్షినగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెంలో ఉన్న నాగ క్షేత్రాన్ని సోమవారం రాత్రి అఘోరీ సందర్శించారు. ఈవిషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఆరిలోవ పోలీసులు క్షేత్రంలోకి ఎవరూ వెళ్లకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగక్షేత్రం యోగి ప్రభాకర్ జీ మాట్లాడుతూ నాగుల చవితి సందర్భంగా క్షేత్రంలో జరిగే ప్రత్యేక పూజల్లో అఘోరీ పాల్గొంటారని తెలిపారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

ఆనందపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యతి) : ఆరోగ్యం పట్ల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ కేంద్ర ప్రతినిధులు సుదర్శన్, దివ్య తెలిపారు. సోమవారం వారు వేములవలస, బోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. దీనివల్ల వ్యాధుల తీవ్రతను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం వల్ల రక్తపోటు, మధుమేహం దరి చేరవన్నారు. వారితో పాటు వైద్యులు గండునాయుడు, మేఘన ఉన్నారు.

'వేతనాల చెల్లింపుల్లో కోత తగదు'



డీఎంహెచ్‌ఓకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మధురవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేతనాల్లో కోత విధించడం పట్ల నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబరు నెలకు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఫేషియల్ యాప్ ప్రకారం వేతనాలు చెల్లించడంతో కొంతమందికి సగానికి పైగా కోత పడిందన్నారు. కొన్నిచోట్ల సిగ్నల్స్ లేకపోవడంతో యాప్‌లో హాజరు నమోదు కావడం లేదని, కొందరు ఫీల్డ్‌లో ఉన్నపుడు యాప్ పనిచేయక పోవడంతో హాజరుపడడం లేదని చెప్పారు. గత నెల వేతనాలను యాప్ ఆధారంగా కాకుండా మాన్యువల్ అటెండెన్స్ ప్రకారం చెల్లించాలని కోరారు.

సమస్యలపై దశల వారీగా పోరాటం : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

తగరపువలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :తగరపువలస, చిట్టివలస పరిధిలో ఉన్న ప్రజా సమస్యలపై దశల వారీగా పోరాటం చేస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. సోమవారం వారు తగరపువలసలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కానూరి రాంబాబు, ఎం. పైడిరాజు మాట్లాడుతూ తగరపువలస పరిధిలోని ఒకటి, రెండు వార్డుల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని, రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డును విస్తరించాలని కోరారు. అలాగే చిట్టివలస శ్మశానవాటికలో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ముందుగా ఈ సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి, తరువాత పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కొండపు ఈశ్వరరావు, అప్పలరాజు, సన్నిబాబు, రామారావు పాల్గొన్నారు.

నాగుల చవితి పూజలకు సిద్ధం



జగదాంబ కూడలి సమీపంలోని ఎల్లమ్మ పుట్ట

జగదాంబ కూడలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నాగుల చవితి పర్వదినం పురస్కరించుకొని దేవాదాయశాఖ అధికారులు పుట్ట వద్ద క్యూలైన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. జగదాంబ థియేటర్ సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద పొతురాజు పుట్టకు సుమారు నూట యాభై ఏళ్ల చరిత్ర ఉంది. నాగుల చవితి రోజున నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడి పుట్టలో పాలు పొయ్యడం ఆనవాయితీ. ఎల్లమ్మతోటగా ఒకప్పుడు జగదాంబ జంక్షన్ పేరు గాంచింది. నగర విస్తరణ తర్వాత ఎల్లమ్మగుడి ప్రాధాన్యత కొంత తగ్గినా, అత్యధిక శాతం మంది భక్తులు కుటుంబాలతో కలసి తెల్లవారుజామున ఇక్కడ పంచ నాగేంద్రుడికి పూజలు చేస్తారు. సంతాన కోరికలు తీరుతాయనేది ప్రగాఢ విశ్వాసం. నాగమ్మతల్లిని పూజిస్తే సకల సంపదలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. పుట్టలో పాలు పోసేందుకు శుభ ఘడియల్లో రావాలని అర్చకులు తెలిపారు.

కిక్కిరిసిన రైతుబజార్

అక్కయ్యపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా పూజా సామగ్రి, కూరగాయలు కొనుగోలు చేసేందుకు విచ్చేసిన వినియోగదారులతో నరసింహనగర్ రైతుబజారు కిక్కిరిసింది. బయట మార్కెట్లలో నాగుల తువ్వాలు, తాటి గుజురు, తంగేటి పూలు, వివిధ రకాల ఫలాలు, నాగ ప్రతిమలు తదితర వస్తువులను కొనుగోలు చేశారు.

ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ప్రదీప్



రాజ్‌కుమార్

డాబాగార్డెన్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాకు చెందిన ప్రదీప్, రాజ్‌కుమార్‌లు జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు వెళ్లే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారని జిల్లా సంఘం కార్యదర్శి చినబాబు తెలిపారు. ఈ నెల 15 నుంచి అనంతపురం ఆర్‌డీటీ మైదానంలో జరగబోయే సంతోష్ ట్రోఫీ కోసం జరిగే పోరులో వీరు పాల్గొంటున్నందుకు సంఘం సభ్యులు హర్షం వెలిబుచ్చారు.

తప్పిన పెనుప్రమాదం



కాకానినగర్ జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

మర్రిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ కొత్తరోడ్డు దరి కాకానినగర్ జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్ నుంచి షీలానగర్ మీదుగా ఎన్ఏడీ వైపు వస్తున్న ట్రాలర్ కాకానీనగర్ వచ్చేసరికి ఎన్ఏడీ నుంచి కాకానినగర్ వైపు వస్తున్న ఆటో యూ టర్న్ తీసుకుంటుండగా, ఆటోను తప్పించే క్రమంలో రాంగ్‌రూట్లోకి వెళ్ళి డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. ప్రమాదం ఉదయం 5 గంటల సమయంలో జరగడంతో పెద్దగా జనసంచారం, వాహనాల రాకపోకలు లేవు. ట్రాలర్‌కు ఉన్న యాక్సిల్ విరిగిపోయి ముందున్న టైర్ విడిపోయి అటువైపుగా వెళ్తున్న గూడ్స్‌పై పడింది. గూడ్స్ఆటో పాక్షికంగా దెబ్బతింది. అదృష్టవశాత్తు లారీ డ్రైవర్, ఆటో డ్రైవర్‌కు ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీని క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ట్రాఫిక్ సీఐ దాశరథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జైలు, జరిమానా

మర్రిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి న ఆరుగురిని 5వ మెట్రోపాలిటన్ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా నలుగురికి రూ.10 వేల నుంచి రూ.13 వేలు వంతున జరిమానా విధించారు. ఒకరికి పది రోజులు, మరొకరికి 11 రోజులు జైలుశిక్ష విధించినట్లు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

శివాలయాలకు కార్తీక శోభ



నక్కవానిపాలెంలో ఉమా నీలకంఠేశ్వరుడు



జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీ పరమేశ్వరాలయం ఎదుట భక్తులు



డాబాగార్డెన్స్‌లో చంద్రమౌళీశ్వరస్వామి

అక్కయ్యపాలెం/సీతమ్మధార/డాబాగార్డెన్స్/జగదాంబ కూడలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం తతతొలితశివాలయాలు బోళాశంకరుడి స్మరణతో ప్రతిధ్వనించాయి. వేకువ జాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి జల, క్షీర, విభూది, పంచామృతాభిషేకాలతో శివునికి అభిషేకాలు చేయించారు. తమ గోత్ర నామాలు చెప్పి అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. జగ్గారావు బ్రిడ్జి సమీపంలోని గౌరీపరమేశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం, రైల్వే న్యూకాలనీలోని శివాలయం, లక్ష్మీనారాయణపురంలోని ఉమా కాశీవిశ్వేశ్వరాలయాల్లో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. డాబాగార్డెన్స్‌లో శివరామకృష్ణ ఆలయ ఈవో జీవీ రమాబాయి సారథ్యంలో అర్చకుడు జి.భార్గవశర్మ ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సీతమ్మధార వద్ద నక్కవానిపాలెంలో ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రామారావు శర్మ, ఉర్జి మహేష్‌శర్మలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు మహా శివలింగాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం ఆకాశదీపం వద్ద దీపాలు వెలిగించారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో ఉజ్జయిని మహాకాళేశ్వరుడు అవతారంలో శివుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మలు వేదమంత్రాలతో పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. వన్‌టౌన్ పాత శివాలయంలో టిక్కెట్ దర్శనాలతో పాటు ఉచిత దర్శనాలకు ఆలయ అధికారులు అవకాశం కల్పించారు. పాత శివాలయంలో భక్తులు స్వయంగా క్షీరాభిషేకం జరుపుకొనే అవకాశం కల్పించారు. గోత్రనామార్చనలు, అభిషేక పూజలు జరిపారు. ధ్వజస్తంభం, వేపచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు, శివనామస్మరణతో ఆలయం మారుమోగింది. ఈవో నీలిమ, సిబ్బంది పర్యవేక్షణలో శీఘ్ర దర్శనాలకు అవకాశం కలిగింది. దసపల్లా హోటల్ వద్ద శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఈవో దేవుళ్ళు పర్యవేక్షించారు, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకున్నారు.

నియోజకవర్గంలో కలియదిరిగిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ఉదయం జీవీఎంసీ 32వ వార్డు పరిధిలోని అస్సాం గార్డెన్స్, అల్లిపురం, పూతివారిమాన్యం, చలువతోట,నేరెళ్లకోనేరు, భీమ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్పొరేటర్ కందుల నాగరాజు, జీవీఎంసీ జోన్ అధికారులు పాల్గొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవాదాయ శాఖతో సమస్య పరిష్కరించాలని, అర్హులకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని, భీమ్‌నగర్ నైట్ సెంటర్‌ను మరోచోటుకు తరలించి కల్యాణమండపంగా మార్చాలని స్థానికులు కోరారు. అల్లిపురం మార్కెట్‌లో రహదారులపైనే వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఏడుగుళ్ల ప్రాంతంలో అర్హులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఏపీడీ పద్మావతి,వార్డు టీడీపీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, జనసేన అధ్యక్షుడు తెలుగు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ ఏరియాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

జగదాంబ కూడలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిధి 38వ వార్డులో అభివృద్ధి పనులకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. విశ్వబ్రాహ్మణ భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.48.68 లక్షలు వెచ్చిస్తారు. మరో రూ.18 లక్షలతో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నాయకులు గోడి నరసింహాచారి, విజయలక్ష్మి, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఉన్న నైట్‌షెల్టర్‌లను డాబాగార్డెన్స్‌లోని ప్రేమ సమాజం, ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ గృహానికి తరలించేందుకు కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలియజేశారు. నియోజకవర్గంలో ఉన్న నైట్‌షెల్టర్‌లను ఖాళీ చేయించి కల్యాణ మండపాలుగా తీర్చిదిద్దేందుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరారు. చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. ఇలా చేస్తే ఆయా షెల్టర్‌లలో చిన్నచిన్న వేడుకలు చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఇక్కడున్న వారందరినీ ప్రేమసమాజం, ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ గృహానికి తరలించేందుకు ఆదేశాలు ఇచ్చినటు తెలియజేశారు. భవిష్యత్‌లో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఆక్రమణలను పరిశీలించి తిరిగి ప్రజలకు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీ ఇచ్చారు.

ఆరోగ్య నగరంగా మారుద్దాం: సీపీ



మారథాన్ మెడల్స్ టీ షర్టు ఆవిష్కరిస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఇతర ప్రముఖులు

మహారాణిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఆరోగ్యకరమైన నగరంగా పేరు పొందేలా కృషిచేద్దామని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సోమవారం సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ మెడల్స్ అండ్ టీ షర్టుల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెరుగైన దేహదారుఢ్యం పొందేందుకు సాగర తీరంలో వేగంగా నడిచే ప్రత్యేక మార్గం (జాగింగ్ ట్రాక్) ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు, తద్వారా ఔత్సాహికులకు మోకాళ్ల నొప్పి సమస్య ఉండదన్నారు. మంచి ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని, నిల్వ పదార్థాలను (జంక్‌ఫుడ్స్) వదిలేయాలని సూచించారు. ఒత్తిడిని అధిగమించటానికి మందులు అవసరంలేదని, కిలోమీటరు దూరం వేగంగా నడవడం లేదా పరుగు చాలన్నారు. అపోలో ఆసుపత్రి సీఓఓ రామచంద్ర, సంధ్య మెరైన్స్ డైరెక్టర్ కె.ఆనంద్ , వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఈఎన్‌సీ చీఫ్



ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందిస్తున్న నేవీ చీఫ్

విశాఖపట్నం తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ అమరావతిలోని సీఎం చంద్రబాబు నాయుడును సోమవారం కలిశారు. డిసెంబరులో జరిగే నేవీ డేకు ఆహ్వానించారు. నేవీ మౌలిక వసతుల ప్రాజెక్టలపై చర్చించారు. సీఎంకు జ్ఞాపికను అందజేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

పోటీ పరీక్షల నిర్వహణపై ఎమ్మెల్సీ వినతి

డాబాగార్డెన్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగుల అభిప్రాయాలను, ఏపీపీఎస్‌సీకి సంబంధించిన వివిధ అంశాలను ఏపీపీఎస్‌సీ చైర్‌పర్సన్ అనురాధకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డా.వేపాడ చిరంజీవిరావు విన్నవించారు. గ్రూప్ 2 మెయిన్స్‌అభ్యర్థుల కోరిక మేరకు 90 రోజులు, గ్రూప్ 1 ప్రాథమిక పరీక్ష అర్హులు జాబితాను 1:100 నిష్పత్తికి పెంచాలని, మెయిన్స్ పరీక్ష తేదీల ప్రకటన, ప్రశ్నపత్రం తర్జుమా విషయంలో దోషాలు లేకుండా చూడాలన్నారు.

నెట్ బాల్ విజేతలు కణితి, మధురవాడ

భీమునిపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి నెట్ బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బాలికల విభాగంలో జడ్పీ హైస్కూల్, కణితి, బాలుర విభాగంలో ది గ్లోబ్ స్కూల్ మధురవాడ విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 17 జిల్లా స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ భీమిలి సన్ స్కూల్‌లో నిర్వహించారు. పోటీలో బాలికల విభాగంలో కణితి జడ్పీహెచ్ఎస్, మధురవాడ ది గ్లోబ్ స్కూల్, నడుపూరు జడ్పీహెచ్ఎస్, మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో మధురవాడ ది గ్లోబ్ స్కూల్, నడుపూరు జడ్పీహెచ్ఎస్, ఉక్కునగరం, సృష్టి వరల్డ్ స్కూల్ విద్యార్థులు మూడు స్థానాలు కైవశం చేసుకున్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్ బాల్ ఇన్‌చార్జి లలిత్‌కుమార్ విజేతలకు బహుమతులు అందించారు.



బాలికల విభాగం విజేత కణితి విద్యార్థినులు

పలువురు క్రీడాకారులకు వ్యక్తి గత పతకాలను అందజేశారు. పోటీలలో ఎంపికైన వారు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు తర్ఫీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ్‌కుమార్, పీఈటీలు, నెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు'

జ్ఞానాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అందే వినతులు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు, సచివాలయ కార్యదర్శులు సక్రమంగా స్పందించడంలేదని, మళ్లీ ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలా జరగకుండా చూసుకోవాలని జడ్సీ ఆదేశించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏడు వినతులు స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి సంబంధించి 5, ప్రజారోగ్య విభాగంపై 2 అర్జీలు అందుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు, ఏఎంహెచ్‌ఓ సునీల్ కుమార్, ఆర్ఓలు బాబూరావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్, ఏపీడీ పుణ్యవతి, ఈఈ తారప్రసన్న, ఏఈ సతీష్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ రాము

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఎం.రమేష్ ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అలస్యం లేకుండా జారీ చేస్తామన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

అక్కయ్యపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ శ్రీదేవి ఆధ్వర్యంలో సంగం ఆఫీస్ సమీపంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనాలను వివరించారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు.

కంచరపాలెం: ఉత్తర నియోజక వర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు ఉద్యమంలా జరుగుతోందని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పేర్కొన్నారు. 55వ వార్డు పరిధి గంగన్న నగర్‌లో టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మరింత చురుగ్గా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, వెల్లంకి భరత్, వీరుబాబు, ఈశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్ ఫ్లైఓవర్ కమ్ మెట్రో కారిడార్

... 5వ పేజీ తరువాయి

తయారుచేయాలని నిర్ణయించారు. ఇదే విషయం మంత్రి నారాయణ వెల్లడించారు.

మొత్తం పది ఫ్లై ఓవర్లు

మెట్రో రైలుతో పాటు వాహనాలు వెళ్లడానికి వీలుగా నిర్మించదలచిన 'రోడ్ ఫ్లైఓవర్-కమ్-మెట్రో కారిడార్'లో మొత్తం పది ఫ్లైఓవర్లు ఉంటాయని వివరించారు. కొమ్మాది నుంచి గాజువాక వరకు మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశ కాబట్టి అటు నుంచి వస్తే మొదట కార్‌షెడ్ జంక్షన్ వద్ద 45 మీటర్లు, ఎండాడ వద్ద 45 మీటర్లు, హనుమంతవాక వద్ద 40 మీటర్లు, మద్దిలపాలెం వద్ద 60 మీటర్లు, సత్యం జంక్షన్ వద్ద 60 మీటర్లు, గురుద్వారా వద్ద 60 మీటర్లు, అక్కయ్యపాలెం వద్ద 45 మీటర్లు, తాటిచెట్లపాలెం వద్ద 60 మీటర్లు, ఎన్ఏడీ జంక్షన్ వద్ద 60 మీటర్లు, గాజువాక వద్ద 60 మీటర్లు, స్టీల్ ప్లాంటు వద్ద 60 మీటర్ల వెడల్పున ఫ్లైఓవర్లు ఏర్పాటుచేస్తారు. ఇవి కాకుండా దువ్వాడలో ఒకటి, లంకెలపాలెంలో మరొక ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ అవి మెట్రో కారిడార్ పరిధిలో లేనందున పక్కనపెట్టారు.

ఒక నిర్మాణంలో 8, మరోచోట రెండు

సింగిల్ స్ట్రక్చర్ (నిర్మాణం) విధానంలో మెట్రో కారిడార్ ప్రాజెక్టు పనులు చేపడతారు. ఒక నిర్మాణంలో ఎనిమిది ఫ్లైఓవర్లను కలుపుతూ 14 కి.మీ., మరో స్ట్రక్చర్‌లో మిగిలిన రెండు ఫ్లైఓవర్లను కలుపుతూ 4 కి.మీ. పొడవైన మార్గాన్ని నిర్మాస్తామని ప్రాజెక్టు ఎండీ వివరించారు.

కేంద్ర నిధులతోనే...

మెట్రో రైలు ప్రాజెక్టును తొలి దశలో కొమ్మాది నుంచి గాజువాక వరకు 46.23 కి.మీ. పొడవున నిర్మిస్తారు. దీనికి రూ.11,498 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. దీనికి పూర్తిగా కేంద్రమే నిధులు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కోరింది. ఇందులో ఫ్లైఓవర్లు కూడా చేరడంతో వాటికి అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని భావిస్తున్నారు. వీటికి కూడా కేంద్రం సాయం కోరాలని నిర్ణయించారు. ఈ 'రోడ్ ఫ్లైఓవర్లు-కమ్-మెట్రో కారిడార్' ప్రాజెక్టుకు మూడు నెలల్లో అంటే 2025 ఫిబ్రవరి మొదటి వారానికి అధ్యయన నివేదిక సిద్ధం అవుతుంది.

ఇకపై డ్రోన్లు

... 5వ పేజీ తరువాయి

రెండింటికీ ఖాళీ స్థలాలపై పన్ను విధించే అధికారం ఉంది. జీవీఎంసీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 37,752 ఖాళీ స్థలాలను గుర్తించి రూ.3.85 కోట్లకు పన్ను నోటీసులు ఇచ్చారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ 39,004 ఖాళీ స్థలాలను గుర్తించి రూ.4 కోట్ల పన్ను వసూలు కోసం నోటీసులు జారీచేశారు. అయితే ఇంకా చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని, స్థానిక సిబ్బంది లాలూచీపడి వాటికి పన్ను విధించడం లేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇకపై మనుషుల ప్రమేయం లేకుండా డ్రోన్ల సాయంతో ఖాళీ స్థలాలను గుర్తించి, ఆ ప్రకారం పన్ను వసూలుకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. వీటి ద్వారా ఏడాదికి రూ.25 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

ఆస్తి పన్ను విధింపులోను...

భవన నిర్మాణ విస్తీర్ణం బట్టి ఆస్తి పన్ను విధిస్తారు. అయితే పలుకుబడిన కలిగినవారు భారీ భవంతులు నిర్మించుకున్నా చాలా తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. కింది స్థాయి సిబ్బందిని మేనేజ్ చేసి తక్కువ పన్నుతో సరిపెడుతున్నారు. ఇలాంటి వాటిని నిరోధించడానికి కూడా డ్రోన్లను వినియోగించాలని నిర్ణయించారు. అసలు ఆస్తి పన్ను వేయని భవనాలు, తక్కువ పన్ను కడుతున్న భవనాలను గుర్తించి రీఅసెస్‌మెంట్ ద్వారా కొత్త పన్నులు వేయాలని భావిస్తున్నారు. దీని ద్వారా ఏటా అదనంగా రూ.50 కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. తక్షణమే డ్రోన్ల వినియోగం అమలు చేయాలని మంత్రి నారాయణ సూచించడంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.

డీఎస్సీకి రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన తరువాత ఒక్కసారి కూడా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రక్రియ ముందుకుసాగలేదు. వైసీపీ ఓటమి పాలై కూటమి అధికారంలోకి రావడంతో ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ప్రకటన కోసం సుమారు 60 వేల మంది ఎదురుచూస్తున్నారు.

సైబర్ నేరాల కోసం వందల్లో బ్యాంకు అకౌంట్లు

... 5వ పేజీ తరువాయి

వినియోగించిన 1,258 సేవింగ్, కరెంట్ బ్యాంకు అకౌంట్స్ వివరాలు సేకరించారు. ఇందులో విశాఖలోనే 470 అకౌంట్లు ఉన్నట్టు, వాటి ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. నకిలీ సంస్థ పేరుతో అకౌంట్లను తెరిచి సైబర్ నేరగాళ్లకు అందించిన ఐదుగురినీ అరెస్టు చేశారు. అలాగే నిందితుడు గిరీష్ నిర్వహించిన లక్కీ కిస్మత్ అనే మరొక ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్ కాల్ సెంటర్ గుట్టురట్టు చేశారు. ఈ కాల్‌సెంటర్‌లో 11 మంది యువతులను టెలీ కాలర్స్‌గా చేర్చుకుని వారితో అమాయకులకు ఫోన్లు చేయించి, ఆన్‌లైన్ బెట్టింగ్స్ ప్రోత్సహించేవారు. కాల్ సెంటర్‌లో పనిచేస్తూ నేరానికి సహకరించిన 11 మంది అమ్మాయిలను కూడా గుర్తించి అరెస్టు చేశారు. అలానే ఈ కేసులో చైనా దేశానికి చెందిన ఐదుగురు ఉన్నట్టు గుర్తించారు.

గుంతల పూడ్చివేతకు వంద రోజులు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా తయారయ్యాయి. గుంతల రోడ్లపై వాహనాలను నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. అయినా వైసీపీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంతల్లేని రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈనెల రెండున రాష్ట్రవ్యాప్తంగా గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గతుకుల రోడ్లకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

పూడ్చేందుకు రూ.90 లక్షలు విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. డిసెంబరు నెలాఖరు నాటికి ఆ 25 కిలోమీటర్ల రహదారులపై గుంతలు పూడ్చనున్నారు. రెండో దశలో మరో 45 కిలోమీటర్లు మేర రహదారుల మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం మరో రూ.48 లక్షలు విడుదల య్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. పద్మనాభం, పెందుర్తి మండలాల్లో రహదారులు మరీ అధ్వానంగా ఉన్నాయని, తొలి దశలో వాటి మరమ్మతులు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ రెండు మండలాల్లోనే 15 కిలోమీటర్లపైన ఉన్నట్టు వెల్లడించారు.

నిర్లక్ష్యంతో అధ్వానం

గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను పూర్తిగా గాలికి వదిలేసింది. గోతుల్లో కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేదు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్లు వేసేందుకు ఎన్‌డీబీ ఇచ్చిన నిధులు, కేంద్ర ప్రభుత్వం అందించిన సాయాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దాంతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము అధికారంలోకి వస్తే రోడ్లపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం...ఇచ్చిన మాట ప్రకారం మొదట గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరుచేసింది.

ఉక్కులో విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని, ధర్నాలో పాల్గొన్నారని, ఇతర ఉద్యోగులను ప్రేరేపించారని ఆరోపిస్తూ ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. దీనిని మొదటి తప్పుగా పరిగణించి చర్యలు తీసుకోవడం లేదని, ఇంకోసారి ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సుమారు 400 మంది ఉద్యోగులకు నోటీసులిచ్చింది.

తీవ్ర వ్యతిరేకత: యాజమాన్యం వైఖరిపై ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. యాజమాన్యం తప్పుడు విధానాలు అవలంబిస్తూ హక్కుల కోసం ఉద్యోగులు పోరాటం చేస్తే చర్యలు చేపడతామని బెదిరించడాన్ని అంతా ఖండిస్తున్నారు. నిబంధనలు పాటిస్తూ తమకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చేస్తే తమకు ధర్నాలు చేయాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బెదిరింపు ధోరణి వీడాలని డిమాండ్ చేస్తున్నారు.

అమర్‌నాథ్.. నోరు అదుపులో పెట్టుకో

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడ అమర్నాథ్ మంత్రిగా ఎంత దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసని టీడీపీ జిల్లా అధ్య క్షుడు గండి బాబ్జి అన్నారు అమర్‌నాథ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు ముఖ్యమత్రి చంద్రబాబు విశాఖ పర్యటనపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండిం చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ సచివాలయంలో ఐటీ మంత్రి చాంబరులో నీరు కారుతుంటే ఎందుకు బాగుచేసుకోలేకపో యారని అమర్‌నాథ్ అడుగుతున్నారని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు సచివాల యానికి వెళ్లారా? అని ప్రశ్నించారు. స్టార్ హోటళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసిన వైసీపీ మంత్రులు ప్రజాధనాన్ని వృథా చేశారని, రుషి కొండలో భవనాలు ఎందుకు కట్టారో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. అమర్‌నాథ్ మంత్రిగా ఎన్ని పరిశ్రమలు తెచ్చారు? ఎన్ని ఉద్యోగాలు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు, అనేక మంది వైసీపీ నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని బాబ్జీ అన్నారు,


మాతృశ్రీ నగర్‌లో మారేడు దళాలు, పుష్పాలతో అలంకరించిన శివలింగం


కణితిలో విభూది అర్చనదారుడైన ఉమామార్కండేశ్వరుడు


వడ్లపూడి ఆలయంలో పూజలందుకున్న బ్రహ్మసూత్ర శివలింగం


చట్టివానిపాలెంలో నాగాభరణంతో శివలింగాన్ని అలంకరించిన దృశ్యం

హరోం హర..

కార్తీక మాసం తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కూర్మన్నపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాలు భక్తుల హర నామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే శైవ క్షేత్రాల వద్ద భక్తులు బారులుతీరారు. 87వ వార్డు వడ్లపూడిలో శ్రీసీతారామలింగేశ్వర స్వామి ఆలయంలోని బ్రహ్మసూత్ర శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో మహిళలు, యువతులు దీపారాధనలు చేశారు. పూజాది కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఆలయ కమిటీ సభ్యులు తాత నాయుడు, మింది గోవింద్, ఎం.రాము, కె.కృష్ణ, బి.గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు. కణితిలో శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విభూదితో స్వామివారికి ప్రత్యేక అర్చన జరిపారు. మాతృశ్రీనగర్‌లోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. 70వ వార్డు చట్టివానిపాలెంలో శ్రీబాలాత్రిపురసుందరి అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పంచామృతాభిషేకాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని వెండి నాగాభరణం, ఇతర ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజలు, అర్చనలు చేశారు. ఆటోనగర్, తోకాడ దుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో స్ఫటిక శివలింగానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సాయంత్రం కార్తీక పురాణ శ్రవణం, లింగాష్టకం, బిల్వాష్టకం, భక్తి గీతాలను ఆలపించారు.

గాజువాక: ఇక్కడి సనత్‌నగర్ ఏకాంబరేశ్వరాలయంలో ప్రధాన అర్చకులు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు


గాజువాక సనత్‌నగర్ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

జరిపారు. అలాగే పలు ప్రాంతాల్లోని శివాలయాలకు వేకువజాము నుంచే భక్తుల తాకిడి నెలకొంది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ అధికారులతో పాటు, ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. స్టీల్‌ప్లాంట్ శివాలయం కూడా భక్తులతో కిటకిటలాడింది.

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని ప్రముఖ దేవాలయాలైన బాలచెరువు ఉమారామలింగేశ్వరాలయం, దుర్గవానిపాలెం రామలింగేశ్వరాలయం, గిరిజా కాలనీ, వికాస్‌నగర్, వెంకన్నపాలెం, నెల్లిముక్కు, నడుపూరుల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహక కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

అగనంపూడి: పెదమడక ఉమామహేశ్వర ఆలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి, పాత దానబోయినపాలెం ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అర్చకులు శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీల ప్రతినిధులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని కాశీవిశ్వేశ్వరాలయంలో అర్చకులు శివలింగానికి పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. అక్కిరెడ్డిపాలెం సాయి శివ మందిరంలో, నాతయ్యపాలెం భీమేశ్వరాలయంలో, తుంగ్లాంలోని విజయ రాఘవస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు.


షీలానగర్ కాశీవిశ్వేశ్వరాలయంలోని ధ్వజస్తంభం వద్ద మహిళల దీపారాధన


మస్తానప్ప ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కు కార్మిక నాయకునికి సంతాపం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప సంతాప సభను సోమవారం ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మిక నాయకునిగా ఉక్కు కార్మిక వర్గానికి 35 ఏళ్ల పాటు సేవలందించిన వ్యక్తి మస్తానప్ప అని, ఆయన లేని లోటు కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు పిట్టా రెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, మసేన్‌రావు, యు.రామస్వామి, డీవీ రమణారెడ్డి, జి.గణపతిరెడ్డి, వరసాల శ్రీనివాసరావు, వైటీ దాసు, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి దయాళ్‌నగర్‌లో శ్రీగౌరీపరమేశ్వరులకు కార్తీక తొలి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. నంది వాహనంపై ఉన్న శివున్ని పూజించడం వల్ల మనసులోని కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దయాళ్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు జరిపారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెంలో ప్రతిష్ఠించిన గౌరీపరమేశ్వరులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దర్శించుకుని పూజలు చేశారు. బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో లలితా, విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, స్థానిక నాయకులు జాజుల సూరిబాబు, మింది కన్నారావు, దాసరి శ్రీనివాసరావు, యూత్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


దయాళ్‌నగర్‌లో పూజలు అందుకున్న గౌరీపరమేశ్వరులు

వ్యాధుల నియంత్రణ పట్ల అవగాహన ఉండాలి

గాజువాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నియంత్రణ పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తినా తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తిపై చర్యలు చేపట్టాలి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి చెందిన స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల కార్డు (ఆర్-కార్డు)ను అక్రమ పద్ధతిలో మార్చుకుని ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు యేల్లేటి సీత, యేల్లేటి నరసయ్యమ్మ, దేముళ్లు సోమవారం స్టీల్‌ప్లాంట్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితురాలైన యేల్లేటి పెంటమ్మకు తాము వారసులమని, అయితే తమకు సంబంధం లేని వ్యక్తి అక్రమ పద్ధతిలో అధికారులను మభ్యపెట్టి ఆర్-కార్డును తమ పేరిట మార్పు చేసుకుని ప్లాంటులో ఉద్యోగం చేస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిపై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైనట్టు వివరించారు. అందువల్ల సదరు వ్యక్తిపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలన్నారు.

రామాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

అగనంపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస రామాలయంలో సోమవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలపై జరుగుతున్న దాడులు, చోరీలకు చెక్ పెట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, బుదిరెడ్డి అప్పారావు, బి.చందూరమేశ్, బి.శ్రీను, అచ్యుత్, బి.ఈశ్వరరావు, హరినాథ్, శ్రీను, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు లక్ష్యం

» తెలుగుదేశం పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, పార్టీ నాయకులు

పెందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని, రూ.100 రుసుముతో రూ.5లక్షల బీమా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలుగుదేశం పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు, నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయడం లక్ష్యంగా సాగుతున్నామన్నారు. మండలంలోని గుర్రమ్మపాలెంలో సోమవారం సభ్యత్వ నమోదుకు ఆయన శ్రీకారం చుట్టారు. యాప్ ద్వార సభ్యత్వ నమోదును ప్రారంభించారు.సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలున్నాయన్నారు, కార్యకర్తలు వారి కుటుంబాల గురించి ఆలోంచించే ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. అంతకుముందు టీడీపీ శ్రేణులు బాబ్జీని సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పార్టీ సీనియర్ నాయకుడు సఖవాసి అజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, గనిశెట్టి కనకరాజు, చిరికి అవతారం, దూది రమణ, అక్కిరెడ్డి చినరమణ, యర్ర రమణ తదితరులు పాల్గొన్నారు. 97వ వార్డు కార్మికనగర్‌లో టీడీపీ సీనియర్ నేత సేనాపతి శంకరరావు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. లైనాల మహేశ్, అర్జున్, మంగరాజు, జగన్, రామారావు పాల్గొన్నారు.

కాకానినగర్‌లో అదుపు తప్పి బోల్తా పడిన లారీ

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 4: కాకనినగర్ జంక్షన్‌లో భారీ లారీ బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 5.30 గంటల సమయంలో ఆటోనగర్ నుంచి ట్రాలీ లారీ వెళ్తుండగా కాకానినగర్ జంక్షన్‌కు వచ్చేసరికి ఆటోను తప్పించే యత్నంలో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ ముందు చక్రాల యాక్సిల్ విరిగిపోయింది ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలు ధ్వంసం

మల్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రెండుచోట్ల జరిగిన ప్రమాదాలలో వాహనాలు ధ్వంసమయ్యాయి. నేవల్ డాక్‌యార్డు నుంచి షీలానగర్ వెళ్లే పోర్టు రోడ్డులో శ్రావణ్ సర్కిల్ వద్ద బొత్ర షిపింగ్ కంపెనీకి చెందిన లారీని అదే సంస్థకు చెందిన మరో లారీ ఢీకొంది. ఎవరికీ గాయాలు కాలేదు. అలాగే నేవల్ డాక్‌యార్డు కాకతీయ గేటు వద్ద ఓ కారు టైర్ పేలిపోవడంతో రోడ్డుకు అడ్డంగా ఉండిపోయింది. ప్రమాదం నుంచి కారు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు.

‘వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి’

సింధియా, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు కాలనీలో సోమవారం వార్డు ఆయన పర్యటించారు. యూజీడీ, శానిటేషన్ సమస్యలను స్థానికులు వివరించారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

శారదాపీఠం ఆధ్వర్యంలో కాశీలో కార్తీక పూజలు

పెందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శారదాపీఠం ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా కాశీ మహా పుణ్యక్షేత్రం కాశీలో ఆధ్యాత్మిక కార్యక్రమం వైభవోపేతంగా జరుగుతోంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో శతచండీయాగం, చతుర్వేద పారయణ, సుందరకాండ హవనం శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు, సోమవారం రామేశ్వరం నుంచి తెచ్చిన మట్టితో సైకత లింగాన్ని తయారు చేసి పీఠాధిపతులు భస్మాభిషేకం, బిల్వ పత్రాభిషేకం చేశారు. శతచండీయాగానికి పూర్ణాహుతి చేశారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిపించారు.

విద్యార్థులంతా సాంకేతిక రంగంపై పట్టు సాధించాలి

అగనంపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంపై విద్యార్థి దశలోనే అందరూ పట్టు సాధించాలని జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ జి.జయసమ అన్నారు. గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగ్గట్టుగా విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను తిలకించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు, ప్రతినిధులు పూర్ణ, ప్రిన్సిపాల్ పీఎస్ఎస్. మూర్తి, అధ్యాపకులు, తదితరులు పాల్గొనారు.

సినిమా గైడ్

- **వీనస్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 38, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 32, పచ్చిమిర్చి 52 కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజి 36, క్యారెట్ 62 దొండకాయలు 38, బంగాళదుంపలు 32, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 60, అల్లం 60, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోసకాయలు 38, వెల్లుల్లి 290, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులను సత్కారించిన సత్కారిస్తున్న రవి, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రోలర్ స్కేటింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. ఒలింపిక్ డేను సోమవారం స్టీల్‌ప్లాంట్ స్కేటింగ్ రింక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్‌లో స్టీల్‌ప్లాంట్ రింక్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఇటీవల ఇటలీలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు హాజరైన ఇండియా జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన స్టీల్‌ప్లాంట్ కోచ్ కాశీ, ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను రవి అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్, యూఆర్ఎస్ఏ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, కార్యదర్శి కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 వినతులు

గాజువాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో 16 వినతులు స్వీకరించారు. పారిశుధ్య సమస్యలను సమస్యలు పరిష్కరించాలని, వీధి లైట్లు వెలిగేలా చూడాలని పలువురు అర్జీలు అందజేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ నాయకులు, వీధి రోడ్లలోని గోతులను పూడ్చాలని పలువురు నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.


ఆదర్శనగర్ ఉమానాగలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సరిపల్లిలో శివుడికి అలంకరణ, పెందుర్తిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

కిటకిటలాడిన శివాలయాలు

గోపాలపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక చంద్రమౌళీశ్వర ఆలయంలో స్వామి దర్శనానికి ఉదయం నుంచీ బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బంకు కూడలిలోని భీమేశ్వరాలయం, కొత్తపాలెం ఉమానాగలింగేశ్వర ఆలయం, ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద గల పార్వతీసహిత చంద్రశేఖరాలయం, నరవ ఉమానాగలింగేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

పారిశ్రామిక ప్రాంతంలో...

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి, ప్రదక్షిణలు చేశారు. మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వద్ద ఉన్న చింతామణి ఆలయం, ప్రకాశ్‌నగర్, రెడ్డివీధి, మాజీ సైనికుల కాలనీ తదితర ఆలయాలు రద్దీని సంతరించుకున్నాయి.

వేపగుంట, ఎన్ఏడీ పరిధిలో...

వేపగుంట/ ఎన్ఏడీ జంక్షన్: కృష్ణానగర్ గుడివీధి దుర్గా మల్లేశ్వరాలయం, రవినగర్ ఉమాశంకర్ ఆలయం, వేపగుంట శివాలయం, ముత్యాలమ్మ గుడి ఆవరణలోని శివాలయం, ప్రహ్లాదపురం శివాలయంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. గణేష్‌నగర్ ఉమా విశ్వేశ్వర కుమార్ స్వామి దేవస్థానంలో శివునికి పంచామృతాభిషేకాలు చేశారు. లక్ష్మీనగర్ ఉమాశంకర గణపతి ఆలయం, సీతారామరాజునగర్ పార్వతీ చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్ శివాలయాల్లో అభిషేకాలు, పూజలు జరిగాయి.

షిప్‌యార్డు న్యూ కాలనీలో...

సింధియా: షిప్‌యార్డు న్యూకాలనీ శివాలయంలో 40, 63వ వార్డు కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గల్లా చిన్నా పూజలు చేశారు.

పెందుర్తిలో...

పెందుర్తి: సరిపల్లి స్వయంభు శివాలయంలో భక్తులు 1,008 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ప్రశాంతినగర్ శివాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల పూజలు చేశారు. పినగాడి చోడేశ్వరాలయం, పాతపెందుర్తి, సుజాతనగర్, చినముషిడివాడ శ్రమశక్తినగర్, వుడాకాలనీ, రత్నగిరినగర్, రాంపురం శివాలయాల్లో పూజలు జరిగాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

» నియోజకవర్గ అభివృద్ధిపై జోనల్ కార్యాలయంలో సమీక్ష

వేపగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశించారు. వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం అభివృద్ధి పనులపై అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 కోట్ల పనులు పూర్తిచేయాలని, గత వైసీపీ హయాంలో టీడీపీ వర్గీయులనే సాకుతో తొలగించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. వార్డు సమస్యలను పరిష్కరించాలన్నారు. పాలనలో వేగం పెంచి, నూతన పనులు చేపట్టాలన్నారు. అంతకుముందు సుమారు రూ.85 లక్షలతో చేపట్టిన జోనల్ కార్యాలయం ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సమావేశంలో కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావు, జెడ్సీ కె.హైమావతి, ఈఈ చిరంజీవరావు, పిన్నింటి పార్వతి, జగన్‌మోహన్‌రావు, వేణు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

రహదారిపై మురుగునీటి ప్రవాహం

మల్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ గేటు సమీపంలోని మల్కాపురం శ్మశానవాటిక కాలువ పొంగి మురుగునీరు రోడ్డుపైకి చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం అలముకుంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్మశానంలో మృతదేహాలతో సహా తెచ్చిన వస్తువులను కాలువలో పడేయడంతో అది పూర్తిగా నిండిపోయి, మురుగునీరు ప్రవహించే మార్గం లేక రహదారిపైకి పొంగింది. సమాచారం అందుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన కాలువను శుభ్రం చేయించారు. ఇక్కడ మ్యాన్ హోల్ లేకపోవడంతో ఫుట్‌పాత్‌పై ఉన్న మ్యాన్‌హోల్ తెరిపించి శుభ్రం చేయించారు. గతంలో శ్మశానంలో వ్యర్థాలను సేకరించడానికి వాహనం వచ్చేది. తాజాగా అది రాకపోవడంతో వ్యర్థాలన్నీ కాలువలో పడేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కోరమాండల్ గేటు సమీపంలో రోడ్డుపై మురుగునీరు

సూపర్ ఫాలోయింగ్

జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు విశేష ఆదరణ


సూపర్‌స్టార్ కృష్ణ గెటప్‌లో జనపరెడ్డి చిట్టిబాబు

ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్, మోజో వంటి ప్లాట్‌ఫాంలు ఫాలో అయ్యేవారికి 'హలో ఫ్రెండ్స్ నేను మీ జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణ' అంటూ పలకరించే జనపరెడ్డి చిట్టిబాబు సుపరిచితుడే. దివంగత సూపర్‌స్టార్ కృష్ణ వేషధారణలో ఆయన సూపర్‌హిట్ పాటలకు డ్యాన్సులు చేస్తూ అందర్నీ అలరిస్తుంటాడు. సరైన రహదారి, సెల్ సిగ్నల్స్ సరిగా లేని అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం మారుమూల కృష్ణంపాలెం పంచాయతీలోని కొత్తవలస అనే గిరిజన కుగ్రామానికి చెందిన చిట్టిబాబుకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాలో లక్షా 45 వేల మంది ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో లక్షా 13 వేల మంది అభిమానులు, యూట్యూబ్‌లో లక్షా 62 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారంటే ఫ్యాన్ ఫాలోయింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

– చోడవరం, ఆంధ్రజ్యోతి

- ఇన్‌స్టాలో 1.45 లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.13 లక్షల ఫాలోవర్స్
- యూట్యూబ్‌లో 1.62 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- సెల్ సిగ్నల్ సరిగా లేని కుగ్రామంలో అదరగొడుతున్న వ్యవసాయ కూలి
- రీల్స్‌తో లక్షల్లో లైకులు కొల్లగొడుతున్న చిట్టిబాబు


యూట్యూబ్ అవార్డు సిల్వర్ ప్లేబటన్‌తో చిట్టిబాబు

మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన జనపరెడ్డి చిట్టిబాబు చిన్నతనం నుంచి సూపర్‌స్టార్ కృష్ణ వీరాభిమాని. కృష్ణ పాటలకు స్టెప్పులు వేయడం, అలాగే డ్రెస్ చేసుకోవడం, హావభావాలు పలికించడం చేస్తూ పూర్తిగా జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణగా మారిపోయాడు. సూపర్‌స్టార్ కృష్ణ పాటలతోనే రీల్స్ చేస్తుంటాడు. ఆ రీల్స్‌కు అభిమానులు ఫిదా అవుతుంటారు. అతని పాపులారిటీ ఎంత వరకు పెరిగిపోయిందంటే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలకు సైతం చిట్టిబాబును ఆహ్వానించి అతనితో డ్యాన్సులు కూడా వేయిస్తున్నారు. తానే సొంతంగా మేకప్ వేసుకోవడం, అవసరమైన కాస్ట్యూమ్స్ సమకూర్చుకోవడం, వాటితోనే ప్రదర్శనలు ఇస్తుండడం, షోలకు వెళుతుండడం గమనార్హం. చిట్టిబాబు చేసిన రీల్స్‌లో అత్యధికంగా 'ఇది మల్లెల మాసమని' పాటకు ఏకంగా నాలుగు మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. దాదాపు అతని అన్ని రీల్స్‌కు రెండు నుంచి నాలుగు మిలియన్ల వ్యూస్ వస్తుంటాయి. తన ఇంటి పరిసరాలు, కొండల నడుమ రీల్స్ చేస్తుండడంతో సహజసిద్ధంగా ఉంటాయి.

టిక్‌టాక్‌లో రీల్స్‌తో తొలిసారిగా అడుగులు

2020 నుంచి టిక్‌టాక్‌లో చిట్టిబాబు.. కృష్ణ పాటలకు స్టెప్పులతో రీల్స్ ప్రారంభించాడు. టిక్‌టాక్ తరువాత కాలంలో ఆగిపోయినా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్, మోజో వంటి మాధ్యమాలలో తన వీడియోలు అప్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. చిట్టిబాబు వీడియోలకు, రీల్స్‌కు అభిమానులు భారీ సంఖ్యలో పెరిగారు. పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన అతను కొత్తవలస గ్రామంలో వ్యవసాయ కూలి. ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిట్టిబాబు డ్యాన్స్ చేస్తుంటే అతని భార్య షూట్ చేస్తుంది. ఎడిటింగ్ సొంతంగా చేసుకుని సిగ్నల్ ఉన్న ప్రాంతానికి వెళ్లి అప్‌లోడ్ చేస్తుంటాడు. సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ జూనియర్ సూపర్‌స్టార్ కృష్ణకు యూట్యూబ్‌లో లక్ష మంది సబ్‌స్క్రైబర్లు దాటిన సందర్భంగా కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ ఇచ్చే సిల్వర్ ప్లేబటన్‌ను ఇటీవలే అందుకున్నాడు. చిట్టిబాబు.. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి, ప్రిన్స్ మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా తన స్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. తన రెండవ కుమారుడికి మహేశ్‌బాబు అని పేరు పెట్టుకున్నాడంటే అతని అభిమానం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చాలా ఆనందంగా ఉంది



రీల్స్ ద్వారా ఈ విధంగా తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అభిమానులను సంపాదించుకోవడం చాలా ఆనందంగా ఉంది. కృష్ణపై అభిమానం ఈ విధంగా నన్ను ముందుకు నడిపిస్తున్నది. ఆయన కుమారుడు మహేశ్‌బాబు అన్నా పిచ్చి అభిమానం. మారుమూల గ్రామం నుంచి ఈ స్థాయిలో పేరుతెచ్చుకోవడం ఎంతో సంతోషాన్నిస్తున్నది. ఓ వ్యవసాయ కూలిగా ఉన్న నేను యూట్యూబ్ నుంచి సిల్వర్ ప్లేబటన్ అవార్డు అందుకోవడం మరిచిపోలేనిది. ఇందులో నా భార్య జగదీశ్వరి సహకారం ఎంతో ఉంది. నా రీల్స్ చూసి ఇతర జిల్లాల నుంచి కూడా కృష్ణ అభిమానులు ప్రత్యేకంగా మాడుగుల వచ్చి అక్కడ నుంచి కష్టపడి మా గ్రామానికి చేరుకుని నన్ను పలకరిస్తున్నారంటే ఇదంతా సూపర్‌స్టార్ కృష్ణ చలవే. ఊపిరి ఉన్నంత వరకు కృష్ణ పాటలకు రీల్స్ చేస్తూనే ఉంటా.

– జనపరెడ్డి చిట్టిబాబు

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మహారాణిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 193 వినతులు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ 61, జీవీఎంసీ 53, పోలీసు 11, ఇతర శాఖలకు చెందిన 68 అర్జీలున్నాయన్నారు. గత వారం అందిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు. ప్రజాధనంతో గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్మించిన రుషికొండ ప్యాలస్‌ను మ్యూజియంగా తీర్చిదిద్దాలని బుద్ధిస్ట్ మూవ్‌మెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. స్కూల్ ఆయాలు, కుకింగ్ హెల్పర్స్‌కు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని వారంతా ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

జీవీఎంసీకి 87 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 87 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నిన్న అలా.. నేడు ఇలా...


సబ్బవరం-షీలానగర్ రోడ్డు ఆదివారం గోతులతో ఇలా..


సోమవారం నాటికి సర్వాంగ సుందరంగా..

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి సబ్బవరానికి వెళ్లే షీలానగర్ ప్రధాన రోడ్డు ఆదివారం సాయంత్రం వరకు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా దర్శనమిచ్చింది. అయితే సోమవారం నాటికి ఒక్కసారిగా ఈ రహదారి రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. ఈ నెల రెండున రాష్ట్రంలోని రోడ్ల మరమ్మతులను సీఎం చంద్రబాబునాయుడు అనకాపల్లిలో ప్రారంభించిన నేపథ్యంలో ఒకరోజు వ్యవధిలోనే షీలానగర్ వద్ద గోతులమయమైన రోడ్డును అధికారులు సుందరంగా తీర్చిదిద్దడం విశేషం.

'అవినీతి రహిత సమాజమే ధ్యేయం'


మాట్లాడుతున్న సీబీఐ ఎస్పీ మురళీ రాంబా

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజంతోనే దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందని సీబీఐ ఎస్పీ మురళీ రాంబా అన్నారు. విశాఖ పోర్టులో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సత్యనిష్ఠ, పారదర్శకత పాటించాలన్నారు. దేశ శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అనే నినాదంతో ఈ ఏడాది ఉత్సవాలు జరిపామన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీఎస్ఎల్ స్వామి, పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయ ఏడీ హఠాన్మరణం


లక్ష్మణరావు (ఫైల్)

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.లక్ష్మణరావు సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన వయసు 58 సంవత్సరాలు. ఆయనకు భార్య లక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడీ లక్ష్మణరావు సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరయ్యారు. తిరిగి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఒక్కసారిగా తన చాంబర్‌లో కుప్పకూలిపోయారు. సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఏడీ లక్ష్మణరావు మృతిపట్ల జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసి, అతని కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

సమస్యలపై వీఆర్‌ఏల నిరసన


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

సిరిపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పేస్కేల్ అమలు చేయాలని, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అటెండర్, వాచ్‌మన్, డ్రైవర్ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను గ్రామ రెవెన్యూ సహాయకులుగా గుర్తించాలన్నారు. వీఆర్వో ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 18లోగా సమస్యలు పరిష్కరించకుంటే సీసీఎల్‌ఏ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎ.సత్యం, పద్మనాభం మండలం అధ్యక్ష, కార్యదర్శులు పి.సాధు, ఎస్.వరం, అర్బన్ మండలం నుంచి నానాజీ, 50 మంది వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

7 నుంచి హైస్కూల్ హెచ్‌ఎంలకు నాయకత్వ శిక్షణ

- రాజాపులోవలోని ఆయుష్ ధర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహణ

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల ఏడో తేదీ నుంచి 12 వరకు నాయకత్వ శిక్షణ ఇవ్వనున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఈ నెల నాలుగో తేదీ నుంచి నిర్వహించాలని భావించారు.ఐదో తేదీన నాగుల చవితి, ఆరో తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు చివరిరోజు కావడంతో ప్రభుత్వం ఏడో తేదీకి వాయిదా వేసింది. రాజాపులోవ సమీపంలోని ఆయుష్‌ధర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే శిక్షణకు జిల్లాలోని 104 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 100 మంది ప్రధానోపాధ్యాయులు హాజరుకానున్నారు. శిక్షణ తేదీలపై వీరంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ నెల 14న మెగా ఉపా ధ్యాయ, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలని ఆదేశించింది. సమావేశానికి ఒక్క రోజు ముందు వరకు శిక్షణలోనే ఉండాలని, దీనివల్ల ఏర్పాట్ల పర్యవేక్షణకు ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. ఈమేరకు శిక్షణ షెడ్యూల్ మార్చాలని కోరుతున్నారు.

రైల్వేలో కారుణ్య నియామకాలకు లోక్ అదాలత్

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్‌లో కారుణ్య నియామకాలకు ఈ నెల 22న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఉద్యోగం ఆశిస్తున్న వారు అన్ని వివరాలతో 18లోగా డీఆర్‌ఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22న లోక్ అదాలత్‌కు పిలిచి, విచారించి నిర్ణయం తీసుకుంటారన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రతించాలని సూచించారు.

ఎస్‌ఆర్‌పురంలో మాల్దీవుల బృందం


ఎస్‌ఆర్‌పురంలో మాల్దీవుల బృందం

పెందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఆర్ పురం గ్రామాన్ని సోమవారం మాల్దీవుల ప్రత్యేక ప్రజాప్రతినిధుల బృందం సందర్శించింది. పంచాయతీ వ్యవస్థ నిర్వహణ, గ్రామీణాభివృద్ధి, సర్పంచుల నిధులు, విధులు, గ్రామ అధికార యంత్రాంగం విధి నిర్వహణ, బాధ్యతలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. స్వయం సహాయక సంఘ మహిళలతో ముచ్చటించి ఆర్థిక స్వావలంబన తెలుసుకున్నారు. అంగన్‌వాడీ, ఆర్‌బీఎస్ కేంద్రాలను సందర్శించారు. గ్రామ సచివాలయం ద్వారా పౌర సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆధునిక సాగు పద్ధతితో లాభాల బాట పడుతున్న రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ పర్యటనలో పరిశీలించిన అంశాలను మాల్దీవుల్లో అమలుచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేస్తామన్నారు. ఈ బృందాన్ని సర్పంచ్ దూది విజయలక్ష్మి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో కొల్లి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గాజువాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గాజువాక సినిమా హాల్ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం జరిగింది. మల్కాపురం ప్రాంతానికి చెందిన సాహిజి పియాత్ (45) ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తుండగా సినిమాహాల్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఆవు అడ్డుగా రావడంతో డ్రైవర్ బస్సును పక్కకు తిప్పారు. వెనక వస్తున్న పియాత్ బస్సు, డివైడర్‌కు మధ్యలో పడిపోయారు. వెనక చక్రాలు ఆయన మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

47 మద్యం సీసాలు పట్టివేత

గాజువాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 47 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు సోమవా రం పట్టుకున్నారు. గాజువాకకి చెందిన ద్వారపూడి చంద్రనాయుడు మద్యం బాటిళ్లను నిల్వ ఉంచినట్టు సమాచారం అందడంతో దాడిచేయగా ఆరు డిఫెన్స్ మద్యం సీసాలతో సహా 47 సీసాలు పట్టుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ నాగశ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, ధీరజ్‌కుమార్‌ను ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నారు.

చంద్రనగర్ పరదేశమ్మ ఆలయంలో చోరీ

గోపాలపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రనగర్ పరదేశమ్మ ఆలయంలో హుండీను పగలగొట్టి ఆగంతకులు నగదు అపహరించారు.ఆదివారం రాత్రి అమ్మవారికి పూజలు ముగిసిన తరువాత గుడికి తాళం వేశారు. సోమవారం ఉదయం గేట్లు పెకిలించి ఉండడాన్ని గుర్తించిన పూజారి చూసి హుండీ తాళం తెరిచి ఉండడంతో కమిటీ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో ఐదు నెలలుగా హుండీ లెక్కింపు జరగలేదని, సుమారు రూ.40వేల వరకూ నగదు ఉండవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.

సీతమ్మధార రోడ్డులో దుకాణాల తొలగింపు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రైతుబజార్ వద్ద దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

సీతమ్మధార, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతు బజార్ బయట అడ్డదిడ్డంగా చిరువ్యాపారులు దుకాణాలు పెట్టడం, ద్విచక్రవాహనదారులు ఇష్టానుసారం వాహనాలు నిలపడంతో నిత్యం రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. బజారుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు, పోలీసులు చోద్యం చూడడం, అడపదడపా పోలీసులు వాహనాల నెంబర్లను సెల్‌ఫోన్ కెమేరాతో తీసి చలానాలు పంపిస్తున్న తీరుపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు అక్కడ కొన్ని వ్యాపారుల దుకాణాలను తొలగించడంతో పాటు వాహనాలు పార్క్ చేయకుండా చర్యలు చేపట్టారు. ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్ఐ భాస్కరరావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కూర్మన్నపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 950 కిలోల రేషన్ బియ్యాన్ని దువ్వాడ పోలీసులు సీజ్ చేశారు. 87వ వార్డు అప్పికొండ కాలనీకి చెందిన కె.వెంకటరమణ కాకినాడ జిల్లా తుని మండలం కత్తిపూడికి చెందిన సుబ్బారావుతో కలిసి రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్ద కొనుగోలు చేసి సబ్బవరంలోని ఓ రైస్ మిల్లుకు విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఆటోలో లోడ్ చేస్తున్న 19 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేశారు.



గణేష్‌బాబు ఆత్మహత్య బాధాకరం

- నాపై చేసిన ఆరోపణలు అవాస్తవం
- సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి


మీడియాతో మాట్లాడుతున్న భాస్కరమూర్తి

ఏలూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని దుర్గాగణేష్ మార్కెటింగ్ అధినేత గణేష్‌బాబు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి అన్నారు. గణేష్‌బాబు తనపై వీడియో ద్వారా చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. సోమవారం ఏలూరు రోడ్డులోని విజయప్లాజాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ ద్వారకానగర్ డైమండ్ పార్క్ వద్ద జిప్లస్ త్రీ బిల్డింగ్‌లో 2018లో సోనోవిజన్ షోరూమ్ ప్రారంభించానని, అదే బిల్డింగ్‌లో గణేష్‌బాబు వ్యాపారం చేస్తున్నారన్నారు. తాను బిల్డింగ్ యజమాని రూపావతికి అడ్వాన్స్‌గా రూ.90 లక్షలు, నెలకు రూ.9లక్షలు అద్దె చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నానన్నారు. గణేష్‌బాబు వ్యాపారం, తన వ్యాపారం ఒకటే కావడం, పోటీ ఉండటంతో తాను గణేష్ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నట్లుగా ప్రచారం చేయడం అవాస్తవమన్నారు. తాను వ్యాపార నిమిత్తం నెలలో రెండుసార్లు విశాఖ వెళ్లి వస్తానని, ఏనాడు గణేష్‌బాబును కలిసి మాట్లాడలేదన్నారు. రూపావతి బిల్డింగ్‌ను తాను కొనుగోలు చేయటానికి ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించడం అవాస్తవమన్నారు. రెండు షోరూమ్‌లు పక్కపక్కనే ఉండడంతో వాహనాల పార్కింగ్ సమస్యను రూపావతి దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఢిల్లీలో జరిగిన బజాజ్ ఫైనాన్స్ సమావేశానికి వెళ్లినప్పుడు గణేష్‌బాబును కులం పేరుతో దూషించానని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తన వద్ద పనిచేసే 80 మంది మేనేజర్లలో 40 మంది గణేష్‌బాబు సామాజిక వర్గానికి చెందిన వారని, 20 శాతం ఎస్సీలని, మిగిలిన వారు బీసీ, ముస్లింలన్నారు. తన సామాజికవర్గానికి చెందిన ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. గణేష్‌బాబు కష్టపడి 10 షోరూమ్‌లు ప్రారంభించారని, నేను కూడా కింది నుంచే వచ్చానన్నారు. గణేష్ షోరూమ్‌ను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించాననడం అపోహన్నారు. వ్యాపారంలో నష్టపోయినా కొనసాగిస్తున్నాన్నారు. గణేష్‌ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

